నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ బుధవారం 17-3-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 191 పేజీలు: 4 వెల: రూ.1/-

రాజకీయ కక్షతో దేశద్రోహం కేసుల నమోదు

దుర్వినియోగం అవుతున్న 124ఏ సెక్షన్
లోక్‌సభలో ప్రస్తావించిన ఎంపి రేవంత్
కాంగ్రెస్ ఆరోపణలను తిరస్కరించిన కిషన్ రెడ్డి
మీసా,టాడా చట్టాలను దుర్వినియోగం చేసింది కాంగ్రెస్ అన్న మంత్రి

న్యూఢిల్లీ,మార్చి16(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా దేశద్రోహం కేసులు ఎక్కువైనట్లు కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి మంగళవారం లోక్‌సభలో ఓ ప్రశ్న లేవనెత్తారు. 124ఏ సెక్షన్‌ను అక్రమంగా వినియోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశద్రోహం కేసుల్లో ఎక్కువ శాతం రాజకీయ దురుద్దేశంతో దాఖలు చేసినవే ఉన్నాయన్నారు. కేసులు బుక్ చేసి.. పాస్‌పోర్ట్‌లను లాగేసుకుంటున్నారన్నారు. ఇలాంటి కేసుల్లో ఏడాది లోగా విచారణ పూర్తి చేస్తున్నారా లేదా అని ఎంపీ రేవంత్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇటీవల కిసాన్ ర్యాలీ నిర్వహించిన తర్వాత అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయని, అనేక మందిపై దేశద్రోహం కేసులు పెట్టినట్లు రేవంత్ ఆరోపించారు. సామాజిక కార్యకర్త దిశ రవిపై నమోదు అయిన దేశ ద్రోహం కేసు గురించి చెప్పాలంటూ రేవంత్ కోరారు. దిశ రవి కేసులో.. ఢిల్లీ పోలీసులు విఫలం అయినట్లు ఎంపీ మనీష్ తివారి ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీలు చేసిన ఆరోపణలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. నేరాల గురించి ఎన్సీఆర్బీ డేటాను సేకరిస్తుందని మంత్రి తెలిపారు. 2014 కన్నా ముందు దేశద్రోహం కేసులు గురించి డేటా లేదన్నారు. ఆ కేసులన్నీ ఐపీసీ క్రైం రికార్డ్స్‌లోనే ఉన్నాయన్నారు. 2014 నుంచి సెడిషన్ గురించి ప్రత్యేక కేసులు నమోదు చేస్తున్నామని మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇటీవల సోషల్ మీడియా వినియోగం ఎక్కువైందని, ప్రజాస్వామ్యం గురించి ఎక్కువ కామెంట్స్ చేస్తున్నారన్నారు. దేశ ద్రోహం కేసుల్లో కేంద్ర ప్రభుత్వ ఇన్వాల్మెంట్ ఉండదని, బాధ్యతలన్నీ రాష్ట్ర ప్రభుత్వం మీదే ఉంటుందన్నారు. చార్జ్‌షీట్, కన్విక్షన్ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక మీదే ఆధారపడి ఉంటుందన్నారు. 2019లో.. ఢిల్లీలో ఎన్సీఆర్బీ ప్రకారం.. ఒకే కేసు నమోదు అయ్యిందన్నారు. దిశ రవి కేసు ఇంకా విచారణ స్థాయిలోనే ఉందన్నారు. ఆమెపై ఎటువంటి చార్జిషీట్ దాఖలు కాలేదన్నారు.

మిసా చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ దుర్వినియోగం చేసిందని మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. జేపీ నారాయణ, వాజ్‌పేయి, అద్వానీ, ఇతర నేతలను మిసా చట్టం కింద అరెస్టు చేశారన్నారు. ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. 1980 దశకంలో టాడా చట్టం కింద అనేక మందిని అరెస్టు చేశారన్నారు. జర్నలిస్టులను, విద్యార్థులను, రాజకీయవేత్తలను మిసా చట్టం కింద అరెస్టు చేసినట్లు మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు.

దేశంలో కొనసాగుతున్న వ్యాక్సిన్ డ్రైవ్

3.29 కోట్లకుపైగా డోసులు వేశామన్న కేంద్రం

న్యూఢిల్లీ,మార్చి16(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌కు వ్యతిరేకంగా ప్రారంభించిన మెగా టీకా డ్రైవ్ దేశంలో ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటి వరకు భారత్‌లో 3.29 కోట్లకుపైగా డోసులు వేసినట్లు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలిపింది. మంగళ వారం ఉదయం 8 గంటల వరకు 3,29,47,432 వ్యాక్సిన్ మోతాదులను ఇచ్చినట్లు మంత్రిత్వశాఖ తెలిపింది. సోమవారం ఒకే రోజు 30,39,394 లక్షల డోసులు వేసినట్లు చెప్పింది. టీకా డ్రైవ్ ప్రారంభించిన నాటి నుంచి ఒకే రోజు ఇంత పెద్ద మొత్తంలో వ్యాక్సిన్ వేయడం ఇదే మొదటిసారి. జనవరి 16న దేశవ్యాప్తంగా మెగా వ్యాక్సిన్ డ్రైవ్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. మొదట ఆరోగ్య కార్యకర్తలకు వ్యాక్సిన్ వేయగా.. గత నెల 2 నుంచి ఫ్రంట్‌లైన్ కార్మికులకు వ్యాక్సిన్ వేస్తున్నారు. ఈ నెల 1 ఒకటి నుంచి 60 ఏళ్లు, 45 ఏళ్లు పైబడిన వారికి కేంద్రం వ్యాక్సిన్ వేస్తోంది.

నోముల నర్సింహయ్యకు శాసనసభ నివాళి

మరణించిన సభ్యులకు సంతాపం ప్రకటించిన సభ
నోములతో తన అనుబంధం విడదీయరానిదన్న సిఎం కెసిఆర్

హైదరాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఇటీవలి కాలంలో మరణించిన ఎమ్మెల్యేలకు,మాజీ శాసనసభ సభ్యులకు సభ నివాళులర్పించింది. నాగార్జున సాగర్ దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్, ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే నాయిని నర్సింహారెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే కమతం రాంరెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కటికనేని మధుసూదన్ రావు, మధిర మాజీ ఎమ్మెల్యే కట్టా వెంకట నర్సయ్య, చెన్నూరు మాజీ సభ్యులు దుగ్యాల శ్రీనివాస్ రావు, జహీరాబాద్ మాజీ ఎమ్మెల్యే చెంగల్ బాగన్న, అమరచింత మాజీ ఎమ్మెల్యే కే వీరారెడ్డికి సభ నివాళు లర్పించింది. వీరందరి ఆత్మలకు శాంతి చేకూరాలని సభ్యులందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. శాసనసభ ప్రారంభమైన వెంటనే నాగార్జున సాగర్ దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య మృతి పట్ల సభలో సీఎం కేసీఆర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సంతాప తీర్మానాన్ని మంత్రులు జగదీష్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్య యాదవ్, రవీంద్ర నాయక్, జైపాల్ యాదవ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ బలపరిచారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులందరూ బలపరిచి నోముల నర్సింహయ్య మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ మాట్లాడుతూ నాగార్జున సాగర్ దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య ఆత్మీయతను ఎప్పటికీ మరువలేనని అన్నారు. ఆయన సంతాప తీర్మానం ప్రవేశ పెట్టాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదన్నారు. ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సీఎం కేసీఆర్ అన్నారు. రెండో రోజు ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో నోముల నర్సింహయ్య మృతి పట్ల సంతాప తీర్మానాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇలాంటి బాధాకరమైన తీర్మానం ప్రవేశపెడుతానని అనుకోలేదు. నోముల నర్సింహయ్య వ్యక్తిగతంగా తనకు దగ్గరి మిత్రులు. చాలా సంవత్సరాలు ఆయనతో కలిసి పని చేశాం. తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన కీలకపాత్ర పోషించారు. నర్సింహయ్య గురువు రాఘవరెడ్డిని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని చూసి నర్సింహయ్య బాధపడేవారు. ఆయనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. కరోనా వచ్చి కూడా పోయింది. హఠాత్తుగా మరణించడం దురదృష్టకరమన్నారు. ఉద్యమశీలి, ప్రజా నాయకుడు స్వర్గీయ నోముల నర్సింహయ్య.. బడుగు బలహీన వర్గాల వారికి తన జీవితాన్ని అంకితం చేశాడు. నోముల నిరంతరం ప్రజా సేవలో గడిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పాలెం గ్రామంలో పేద యాదవకుటుంబంలో జన్మించిన నోముల.. ఓయూలో ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే ఉద్యమాలకు నాయకత్వం వహించారు. పేద ప్రజల పక్షం వహించి ప్రజా న్యాయవాదిగా పేరు తెచ్చుకున్నారు. తన ఆశయాలకు అనుగుణంగా సీపీఎం పార్టీలో చేరారు. మండల పరిషత్ అధ్యక్షునిగా ప్రారంభమైన నోముల ప్రస్థానం ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారు. ఆయన ప్రసంగాలు ఎందరినో ఆకర్షించేవి. ప్రజా సమస్యలను ప్రస్తావించడంలో

ఆయన దిట్ట. ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతుల హక్కుల కోసం నర్సింహయ్య నిరంతరం పోరాడారు. నకిరేకల్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు గెలుపొందారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల సీపీఎం పార్టీ వైఖరికి నిరసనగా ఆ

పార్టీని వదిలి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018లో నాగార్జున సాగర్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 64 ఏండ్ల వయసులో గత డిసెంబర్‌లో గుండెపోటుతో మరణించడం తెలంగాణ ప్రజలకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. ఆయన ఆత్మీయతను ఎప్పటికీ మరువలేను. నర్సింహయ్య ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు అని సీఎం అన్నారు.

తెలంగాణలో పసుపు బోర్డు హామీ ఏమయ్యింది

లోక్‌సభలో ప్రశ్నించిన కాంగ్రెస్ ఎంపి ఉత్తమ్
దాటవేత సమాధానం ఇచ్చిన కేంద్రమంత్రి

న్యూఢిల్లీ,మార్చి16(ఆర్ఎన్ఎ): తెలంగాణలో పసుపు బోర్డు ఎందుకు పెట్టడం లేదని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. ఎన్నో ఏళ్ల నుంచి రైతులు పసుపు బోర్డు కోసం ఆందోళనలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 80 శాతం పసుపు ఇండియాలో ఉత్పత్తి అవుతోందని, దాంట్లో 50 శాతం తెలంగాణలోనే ఉత్పత్తి అవుతోందన్నారు. బోర్డు ఏర్పాటు చేయడంలో సమస్య ఏంటని ఆయన ప్రభుత్వాన్నిప్రశ్నించారు. బోర్డు ఏర్పాటు చేసి.. బెటర్ వెరైటీలు పండించవచ్చున్నారు. తన ప్రశ్నకు ప్రభుత్వం క్లియర్ ఆన్సర్ ఇవ్వడంలేదన్నారు. పసుపు బోర్డు పెడుతున్నారా లేదా అని అడిగాం.. కానీ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వలేదన్నారు. రాజ్‌నాథ్, ప్రకాశ్ జవదేకర్, రామ్ మాదవ్ .. ఆ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ.. బోర్డు పెడుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఉత్తమ్ లేవనెత్తిన ఈ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి పరుశోత్తం రూపాలా సమాధానం ఇచ్చారు. 50 మసాలాల కోసం బోర్డు ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ కోసం నిజామాబాద్‌లో .. కేవలం పసుపు కోసం ప్రత్యేక సెంటర్ పెట్టినట్లు చెప్పారు. కానీ ప్రత్యేక బోర్డు పెట్టలేదని మంత్రి తెలిపారు. ఈ సందర్భంలో ఉత్తమ్ మాట్లాడుతూ.. కేవలం స్పైస్ బోర్డు ఎక్స్‌టెషన్ మాత్రమే నిజామాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు మంత్రి చెబుతున్నారని అన్నారు. టర్మరిక్ బోర్డు ఏర్పాటు చేస్తే .. ఆ రైతు సమస్యలన్నీ పరిష్కరించవచ్చు అని తెలిపారు. పసుపు రైతుల మద్దతు కోసం.. స్థానిక ప్రభుత్వంతో కలిసి పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పరుశోత్తం మరోసారి తెలిపారు. ఆ పార్క్‌తో కొత్త వెరైటీలతో ఉత్పత్తి పెంచనున్నట్లు తెలిపారు. పసుపు రైతుల కోసమే ఆ ఎక్స్‌టెషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఒక మసాలా కోసం కాదు, 50 మసాలాల కోసం ఆ సెంటర్ పనిచేస్తుందన్నారు. స్థానిక యూనివర్సిటీ సాయంతో.. కొత్త వెరైటీలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కానీ పసుపు బోర్డుపై మాత్రం మంత్రి క్లారిటీ ఇవ్వలేదు. జాతీయ టర్మరిక్ బోర్డును ఏర్పాటు చేయాలని కర్నాటక ఎంపీ బచ్చే గౌడ డిమాండ్ చేశారు.

మహారాష్ట్రలో కరోనా పరిస్థితి దారుణం

కొవిడ్ టాస్క్ ఫోర్స్ సభ్యుడు శశాంక్ జోషి

ముంబై,మార్చి16(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి పీడ విరగడైనట్లే అనుకున్న సందర్భంలో మళ్లీ కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్రలో ప్రతి రోజూ నమోదవుతున్న కేసులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. మాస్క్‌లు పెట్టుకోకుండా, వ్యాక్సిన్ వల్ల వచ్చిన బాధ్యతారాహిత్యంతో ప్రజలు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని మహారాష్ట్ర కొవిడ్ టాస్క్ ఫోర్స్ సభ్యుడు శశాంక్ జోషి అన్నారు. మహారాష్ట్రలో పరిస్థితి చాలా దారుణంగా ఉన్నదని, కొవిడ్ చాలా వేగంగా వ్యాపిస్తోందని ఆయన చెప్పారు. ముంబైలో టెస్టింగ్ కూడా తగ్గిపోయిందని ఆయన తెలిపారు. రెస్టారెంట్లలో మాస్కులు పెట్టుకోకపోవడం అన్నది మహారాష్ట్రలో ఆందోళన కలిగించే అంశం. ప్రజలు ఇలాగే ఉంటే కరోనాను నియంత్రించడం సాధ్యం కాదు. వ్యాక్సినేషన్ వల్ల ప్రజల్లో బాధ్యతారాహిత్యం పెరిగిపోతోంది. వ్యాక్సినేషన్ తర్వాత కూడా కనీసం రెండు నెలలు జాగ్రత్తగా ఉండాలి. యాంటీబాడీలు సడెన్‌గా తగ్గిపోయి కరోనా మళ్లీ దాడి చేసే ప్రమాదం ఉంటుంది. ఈ ఏడాది మొత్తం కచ్చితంగా మాస్కులు ధరించాల్సిందే అని శశాంక్ జోషి స్పష్టం చేశారు. సోమవారం మహారాష్ట్రలో 15 వేలకుపైగా కేసులు నమోదయ్యాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది. లాక్‌డౌన్లు, రాత్రి కర్ఫ్యూలో కూడా కరోనాను కట్టడి చేయలేకపోతున్నాయి.

బడుగు వర్గాలకు అండ నోముల

సంతాప తీర్మానంలో మంత్రులు ఘనంగా నివాళి అర్పించిన నేతలు

హైదరాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ): దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య జీవితాంతం ప్రజాసేవకే పోరాటం చేశారని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకొని రాజకీయాల్లో రాణించారన్నారు. భూస్వామ్య పెత్తందారీ వర్గాలను ప్రశ్నించిన గొంతుక నోములదన్నారు. నోముల సంతాప తీర్మనం పై మంత్రి మాట్లాడుతూ ..మార్క్సిస్టు నేత నర్రా రాఘవరెడ్డి అనుచరుడిగా అనేక ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యమయ్యారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం సీఎం కేసీ ఆర్ నాయకత్వంలో ఉద్యమం జరుగుతున్న సందర్భంలో తాను రాసిన వ్యాసాలపై స్పందిస్తూ సూర్యాపేటలో మొదటిసారిగా నోముల నర్సింహయ్యను కలుసుకున్న సందర్భాన్ని మంత్రి గుర్తు చేశారు. సీపీఎం నేతగా ఉన్న ఆయన నాడు తాను రాసిన వ్యాసంపై పార్టీ డిఫెన్స్‌లో పడిందని చెబుతూనే.. ఎన్నటికో ఒక నాడు నేను మీ దారిలోకి వస్తానంటూ చెప్పారన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత.. 2014లో జరిగిన ఎన్నికల నాటికి టీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారన్నారు. అలాంటి నేత నేడు మనమధ్యలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. నోముల నర్సింహయ్య బడుగు, బలహీన వర్గాల బాంధవుడు అని మంత్రి కేటీఆర్ అన్నారు. ఎనిమిది సంవత్సరాలుగా నోములతో అనుబంధం ఉంది. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో మున్సిపాలిటీలు లేవు. 15 వేల పైచిలుకు జనాభా ఉండే మేజర్ గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో సాగర్ నియోజకవర్గంలోని నందికొండ, హాలియాను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశాం. ఈ మున్సిపాలిటీల్లో అనేక సమస్యలు ఉన్నాయి.. పరిష్కరించాలి అని నోముల తనను పదేపదే కోరేవారు. అణగారిన వర్గాల కోసం గొంతు విప్పిన నాయకుడిగా నోములకు పేరుందన్నారు. ఎన్నో సందర్భాల్లో ఆయన తెలంగాణ గురించి మాట్లాడేవారు. నోముల మరణం సాగర్ నియోజకవర్గానికే కాకుండా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. నోముల మరణం పట్ల తీవ్రమైన సంతాపం తెలుపుతున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య చేసిన ప్రసంగాలు ఆలోచింపజేసే విధంగా ఉండేవని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. నోముల మరణం చాలా బాధాకరం. వారికి తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. నోముల వరంగల్ బిడ్డను పెళ్లి చేసుకున్నారు. అలా ఆయన తనను మామ అని పిలిచేవారు. తాను కూడా నోములను అల్లుడి అని ఆప్యాయంగా పలుకరించేవాన్ని అని ఎర్రబెల్లి తెలిపారు. రైతులకు మద్దతుగా నిరంతరం కృషి చేసేవారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు బాగుపడుతున్నాయని ఎన్నోసార్లు నోముల గుర్తు చేసేవారు. విమర్శ కూడా ఒక పద్ధతిగా ఉండేది. నోముల ప్రసంగాల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ప్రజల కోసం పోరాటం చేసిన నాయకుడు మన మధ్యలో లేకపోవడం దురదృష్టకరమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

నేడు పట్టభద్ర ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

-ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

హైదరాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ): పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం దయం రెండు ఎమ్మెల్సీలకు ఓట్ల లెక్కింపు జరుగనుంది. సాయంత్రానికి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ప్రతి రౌండులో 56 వేల ఓట్ల చొప్పున లెక్కించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీలో నిలవటంతో ఓట్ల లెక్కింపునకు అధిక సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలో 5,31,268 మంది ఓటర్లకు గాను 3,57,354 మంది తమ హక్కు వినియోగించుకున్నారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గంలోని 12 జిల్లాల పరిధిలో 5,05,565 మంది ఓటర్లకు గాను 3,86,320 మంది తమ హక్కును వినియోగించుకున్నారు. రెండు నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు కోసం 1,606 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గానికి సంబంధించి 806 మంది సిబ్బందిని ఖరారు చేసింది.

వరంగల్-ఖమ్మం-నల్గొండ ఓట్ల లెక్కింపు కోసం 800 మంది పనిచేయనున్నారు. ఒక్కో టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇరువురు సిబ్బంది, ఒక సూక్ష్మ పరిశీలకుడిని నియమించారు. తొలుత చెల్లుబాటయ్యే ఓట్లను గుర్తించి 25 చొప్పున కట్టలు కడతారు. ఆ తరవాత ప్రాధాన్య క్రమంలో ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు.

అసెంబ్లీ ముట్టడికి విద్యార్థి ఫెడరేషన్ సంఘం యత్నం

హైదరాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ)! తెలంగాణ విద్యార్థి ఫెడరేషన్(టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పూనుకున్నారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. న్యాయవాద దంపతులు వామనరావు, నాగమణిలను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీలకి వీసీలని నియమించాలన్నారు. 100 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలంగాణ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జటనీగి సురేష్ యాదవ్ పేర్కొన్నారు.

పంజాగుట్ట ఫ్లై ఓవర్ పిల్లర్‌కు మరోమారు మంటలు

హైదరాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ): నగరంలోని పంజాగుట్ట ఫ్లై ఓవర్ కింద మరోసారి అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. పిల్లర్‌కు ఏర్పాటు చేసిన ÷బైర్ డెకరేషన్‌లో మంటలు చెలరేగడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసింది. అగ్నిప్రమాదం కారణంగా ఆ మార్గంలో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. మూడు రోజుల క్రితం ఇద్దే ఫ్లై ఓవర్ కింద్గ ÷బైర్ డెకరేషన్‌లో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందా? లేక ఎవరైనా నిప్పు పెట్టారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంగారెడ్డి,మార్చి16(ఆర్ఎన్ఎ): చౌటకూర్ మండలంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాలీ ఆటోను డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాంతయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా..మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శివంపేట బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. స్థానికుల ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంలో గాయాలైన వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేలను ప్రైవేటీకరించం: మంత్రి పియూష్ గోయల్

న్యూఢిల్లీ: భారతీయ రైల్వేలను ప్రైవేటీకరించడం జరుగదని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ స్పష్టం చేశారు. రైల్వేలు సదా భారత ప్రభుత్వంతోనే ఉంటాయని మంగళవారం చెప్పారు. 'రైల్వేలను ప్రైవేటీకరించినట్లు మాపై ఆరోపణలు ఉన్నాయి. కానీ, ప్రభుత్వ వాహనాలు మాత్రమే రోడ్లపై నడపాలని ప్రజలు ఎప్పుడూ అనరు. ఎందుకంటే ప్రైవేట్, ప్రభుత్వ వాహనాలు రెండూ ఆర్థికంగా సహాయపడతాయి. రైల్వేలో పెడుతున్న ప్రైవేట్ పెట్టుబడులు ఇక్కడ సేవలను మరింత మెరుగు పరుస్తాయనే ఉద్దేశంతోనే మనం స్వాగతించాలి" అని గోయల్ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశ రైల్వే మౌలిక సదుపాయాలు కొత్త విజన్‌ను చూశాయని, రైల్వే ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాలకు సమృద్ధిని తీసుకొచ్చినట్లు

లోక్‌సభలో రైల్వే గ్రాంట్స్ డిమాండ్లపై చర్చకు సమాధానమిస్తూ పియూష్ గోయల్ చెప్పారు.

'భారత రైల్వేలు దేశానికి 'వృద్ధికి ఇంజిన్'గా పనిచేయాలని మేం కోరుకుంటున్నాం. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో రైల్వేల అభివృద్ధి కోసం రూ. 2 లక్షల కోట్లకు పైగా కేటాయించాం' అని పియూష్ గోయల్ తెలిపారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఎలాంటి ప్రాజెక్టులను అమలు చేయకుండా కంటితుడుపు ప్రకటనలు చేశారని గత ప్రభుత్వంపై ఆయన నిందలు మోపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలిసి పనిచేసినప్పుడే దేశం మరింత వృద్ధి వైపు పయనించగలదని, మరిన్ని ఉపాధి అవకాశాలను సృష్టించగలదని మంత్రి అన్నారు. రెండేండ్లలో రైలు ప్రమాదం కారణంగా ఏ ఒక్క ప్రయాణికుడు చనిపోలేదని, ప్రయాణికుల భద్రతపై రైల్వే అధికంగా దృష్టి సారిస్తున్నదని చప్పారు. రైలు ప్రమాదం కారణంగా చివరి మరణం 2019 మార్చిలో జరిగింది అని మంత్రి పియూష్ గోయల్ వెల్లడించారు.

బ్యాంకుల సమ్మెతో సామాన్యులకు ఇక్కట్లు

-రాజ్యసభలో ప్రస్తావించిన కాంగ్రెస్ నేత ఖర్గే

న్యూఢిల్లీ,మార్చి16(ఆర్ఎన్ఎ): బ్యాంకు ఉద్యోగుల సమ్మె గురించి ఇవాళ రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే మాట్లాడారు. గత రెండు రోజుల నుంచి తొమ్మిది బ్యాంకులకు చెందిన ఉద్యోగులు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల వ్యాపారాలకు, సాధారణ ప్రజలకు ఇబ్బంది తలెత్తిందన్నారు. మార్చి 17వ తేదీన జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా సమ్మెకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. మార్చి 18వ తేదీన ఎల్ఐసీ ఉద్యోగులు కూడా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్ట్రయిక్ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ బ్యాంకుల్లో సుమారు 13 లక్షల మంది పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. సమ్మె చేస్తున్న బ్యాంకుల్లో సుమారు 75 మంది కోట్ల మందికి అకౌంట్లు ఉన్నాయని, కానీ ఆ బ్యాంకుల స్టేక్‌హోల్డర్లతో చర్చలు నిర్వహించకుండానే ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరిస్తున్నదని ఆరోపించారు. రిజర్వడ్ క్యాటగిరీల్లో ఉన్న వారికి ఇలాంటి బ్యాంకుల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాయన్నారు. ఇందిరా గాంధీ ఈ బ్యాంకులను జాతీయం చేసిందని

పసుపు రైతుల కంట్లో మోడీ కారం !

తెలంగాణాకే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటి నుంచో పసుపు బోర్డు కావాలన్న డిమాండ్ ఉంది. పొగాకు బోర్డు తరహాలో పసుపు బోర్డును ఏర్పాటు చేయాలన్న రైతుల డిమాండ్‌ను కాంగ్రెస్ పార్టీ పట్టించు కోలేదు. అయితే బిజెపి అధికారంలోకి వస్తే ఆ ఆశ నెరవేరుతుందన్న భావన ఉండేది. నిజామబాద్ ఎంపి ఎన్నికల్లో పోటీ చేసిన ధర్మపురి అర్వింద్ కూడా దీనికోసం ఇచ్చిన హామీ మళ్లీ రైతుల్లో ఆశలను సజీవంగా నిలిపింది. అయితే క్షేత్రస్థాయిలో రైతుల ఆకాంక్షలను మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కార్పోరేట్ల సేవలో తరించడానికే ప్రధానిగా వచ్చిన మోడీ ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడం, బ్యాంకులను విలీనం లేదా ప్రైవేటీకరణం చేయడం వంటి నిర్ణయాల్లో చూపుతున్న ఉత్సాహం, ప్రజలకు సంబంధించి మాత్రం చూపడం లేదు. ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతులను పట్టించుకోవడం లేదు. వారి ఆందోళనలకు అనుగుణంగా సాగు చట్టాలపై చర్చించడం లేదు. అలాగే మొండిగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టారు. దీనిపై స్థానిక ప్రజలు పెద్ద ఎత్తు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. బ్యాంకు ఉద్యోగులు ఆందోళనలకు దిగిన ఆఖాతరు చేయడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సమస్యలపై మోడీ మొండి వైఖరి కారణంగా ప్రజల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయి. ఇకపోతే పసుపు బోర్డు ఏర్పాటు విషయంలోనూ ఇదే వైఖరితో ఉన్నారు. పసుపు పండించిన రైతులను ఆదుకునే క్రమంలో కేంద్రం ముందు నుంచీ విముఖంగానే ఉంది. మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కూడా అందుకు భిన్నం కాదని నిరూపించు కుంది. బీజేపీ ఏడాదిన్నర కాలంగా పసుపు రైతులను గందరగోళానికి గురి చేస్తూ వచ్చింది. తీరా రాజ్యసభ వేదికగా సాక్షాత్తూ వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ లిఖిత పూర్వకంగా రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డికి ఇచ్చిన సమాధానంతో బిజెపి కుత్సితం ఏంటో తేలిపోయింది. మరి పసుపు రైతులకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తామన్నదానికి మాత్రం సమాధానం లేదు. బోర్డు ఇచ్చేది లేదు... పసుపు బోర్డు ప్రతిపాదనే తమ వద్ద లేదంటూ కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడం చూస్తుంటే రైతుల పట్ల ఆ పార్టీకి , ప్రధాని మోడీకి ఉన్న ప్రేమ ఏపాటిదో తెలుసుకోవచ్చు. మేకిన్ ఇండియా..ఓకల్ ఫర్ లోకల్ అంటూ మాటలను గుప్పిస్తున్న మోడీ లోకల్ పసుపును ఎలా వినియోగంలోకి తేవాలో తెలుసుకోకపోవడం దారుణం. పసుపు బోర్డు ఏర్పాటు అంశమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి లేకపోవడంతో తక్షణమే రాజీనామా చేయాలంటూ ఎంపి ధర్మపురి అర్వింద్‌ను పసుపు రైతులు డిమాండ్ చేస్తున్నారు. మరి తమ ఎంపి ఇచ్చిన హామీని ఎలా నెరవేర్చాలన్న ఆలోచన వారికి లేదు. కనీసం ఎంపితో మాట్లాడాలన్న జ్ఞానం కూడా ఉన్నట్లు లేదు. కేవలం పెద్దవాళ్లతో మాట్లాడి వారికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం మినహా స్థానిక ఎంపితో మాట్లాడి సమస్యసలను పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదని కేంద్రమంత్రి సమాధానం తో బట్టబయలు అయ్యింది. పసుపు బోర్డు ఏర్పాటు చేయకుంటా పండించిన పసుపును మద్దతు ధరలకు ఎలా కొనుగోలు చేయబోతున్నారో కూడా చెప్పడం లేదు. ఇది ఒక్క నిజామాబాద్‌కే కాకుండా మొత్తం దేశానికే లబ్ది చేకూర్చే అంశంగా చూడాలి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ ఇప్పటికే నిజామాబాద్ జిల్లాలో స్పైసెస్ బోర్డు రీజినల్ ఆఫీస్ అండ్ ఎక్స్‌టెన్షన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందంటూ పేర్కొన్నారు. పసుపు పంట ఉత్పత్తి, ఎగుమతులకు సంబంధించిన విషయాలను పరిశీలించేందుకు రీజినల్ ఆఫీస్ పని చేస్తుందంటూ వివరించారు.

నిజామాబాద్‌తో పాటు వరంగల్, హైదరాబాద్, ఖమ్మంలో స్పైసెస్ బోర్డు రీజినల్ కార్యాలయాలు ఉన్నాయంటూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ రాత పూర్వకంగా పేర్కొనడం విశేషం.తెలంగాణ రాష్ట్రంలో పండుతున్న పసుపు పంట తీరుతెన్నులపై వివరణ కోరుతూ కేంద్ర ప్రభుత్వా న్ని రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డి పలు ప్రశ్నలు సంధించారు. వీటికి రాజ్యసభలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ మార్చి 12న లిఖిత పూర్వకంగా ఎంపీకి సమాధానం ఇచ్చారు. ఇందులో తెలంగాణ రాష్ట్రంలో సాగవుతున్న పసుపు పంట గొప్పతనాన్ని వివరించారు. 2019-20లో తెలంగాణలో 55,444 ఎకరాల్లో పసుపు సాగు కాగా 3.86 లక్షల టన్నుల దిగుబడి వచ్చిందని కేంద్ర మంత్రి వివరించారు. పసుపు రైతులకు మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎం.ఐ.డి.హెచ్) ద్వారా చేపడుతున్న కార్యక్రమాల సరళిని ఊటంకించారు. మద్దతు ధర అంశంలో జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం ద్వారా రైతులకు మేలు చేసేందుకు కృషి చేస్తున్నట్లుగా వివరించారు.

చివరగా పసుపు బోర్డు ఏర్పా టు ప్రశ్నకు జవాబిస్తూ... తెలంగాణ రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు ప్రతిపాదనే తమ వద్ద లేదంటూ తేల్చి చెప్పారు. నిజామాబాద్ రూరల్ ఆర్మూర్, బాల్కొండ, జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సుమారు 80వేల ఎకరాల్లో పసుపు పంట సాగవుతోంది. నిర్మల్ జిల్లాలోనూ పసుపు సాగు జోరుగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పండే పసుపు పంటకు కేరాఫ్ అడ్రస్‌గా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ నిలుస్తున్నది. రవాణాకు అనువు గా ఉండే నిజామాబాద్‌లోనే పసుపు రైతుల మేలు కోసం బోర్డు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత కర్షకులు గడిచిన రెండు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు. కొత్త సాగు చట్టాలను రద్దు చేయాలని కోరుతూ రైతులు మూడు నెలలుగా ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళనలు చేస్తున్నారు. అయినా చలించని మనస్తత్వంతో ప్రధాని మోడీ ఉన్నారు. వారి సమస్యలను చర్చించడానికి కూడా సిద్దంగా లేదు. ఇకపోతే దేశవ్యాప్తంగా రైతుల పరిస్థితి దీనంగా ఉంది. వారికి కేంద్రం చేస్తున్న ఉపయోగాఉల ఏమీ లేవు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం, ఎగుమతుల ద్వారా ఆదాయాన్ని పొందం లాంటి చర్యలు శూన్యం.

ఇరకాటంలో ఎంపి ధర్మపురి అర్వింద్

సొంత ఎంపినే సందిగ్ధంలోకి నెట్టేసిన కేంద్రం
పసుపుబోర్డు హామీని తుంగలో తొక్కిన బిజెపి

నిజామాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో పసుపు బోర్డు పెట్టే ప్రతిపాదనేదీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఇప్పుడు ఇరకాటంలో పడ్డారు. సొంత ఎంపినే ఇరకాటంలో పెట్టేలా, ఆయన ప్రతిష్టను దెబ్బతీసేలా, ఆయన పట్ల నియోజకవర్గ ప్రజల్లో చెడు అభిప్రాయం కలిగించేలా కేంద్రం నిర్ణయం తీసుకున్నది. తెలంగాణలో పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తాను అన్న ప్రధాన హామీతో ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించిన ధర్మపురి అరవింద్ ఇప్పుడు పసుపు రైతులకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక ఏపీలోనూ విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో అమ్మి తీరతామని తేల్చి చెప్పి ఏపీ బీజేపీ నేతలకు ఇబ్బందులు సృష్టించారు . గతంలోనూ ప్రత్యేక హోదా విషయంలో ఇచ్చిన హామీ తప్పి ఏపీ ప్రజల్లో పట్టు కోల్పోయారు అధిష్టాన నిర్ణయాలతో తెలంగాణా ,ఏపీ బీజేపీ నాయకులకు చుక్కలు కనిపిస్తున్నాయి. విభజన హామీలను గాలికి వదిలేశారు. బయ్యారం ఉక్కూ లేదు. కడప స్టీల్ ప్లాంట్ ఊసే లేదు. ఉన్న విశాఖ ఉక్కును తుక్కుగా అమ్ముతామని చెప్పేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో పసుపు రైతుల ఆందోళన ఉధృతంగా సాగింది. ఉద్యమ బాట పట్టిన నిజామాబాద్ పసుపు రైతులు పెద్ద సంఖ్యలో ఎన్నికల్లో పోటీకి సైతం దిగారు. దేశ వ్యాప్తంగా నిజామాబాద్ పసుపు రైతుల ఉద్యమం చర్చనీయాంశమైంది. ఆ సమయంలో కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, కచ్చితంగా పసుపు బోర్డును తీసుకువచ్చి తీరుతానని,తనకు ఓటువేసి గెలిపించాలని ధర్మపురి అరవింద్ చేసిన విజ్ఞప్తిని నమ్మిన ప్రజలు ఓటేశారు. రైతులు కూడా పసుపు బోర్డును అరవింద్ ఖచ్చితంగా తీసుకొస్తారని నమ్మారు. తనను గెలిపిస్తే పసుపు బోర్డు కచ్చితంగా తీసుకుని వస్తానని ఏకంగా ఓటర్లకు బాండు రాసిచ్చిన అరవింద్, ఇప్పుడు ఆ బాండ్ పై సమాధానం చెప్పాల్సి ఉంది. పసుపు బోర్డు తీసుకురాలేకుంటే రాజీనామా చేస్తానని సవాల్ .. ఇప్పుడు అరవింద్ రాజీనామాకు డిమాండ్ చేస్తున్నారు. నాడు ప్రచారానికి వచ్చిన బీజేపీ నేతలు సైతం ఇదే హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత ఇప్పటివరకు పసుపు బోర్డు సంగతి ఊసేలేదు. మధ్యలో మున్సిపల్ ఎన్నికల సమయంలో నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేసే దిశగా బోర్డు డైరెక్టర్లుగా ఐఏఎస్ అధికారులను కేంద్రం నియమించిందని ప్రజలను నమ్మించే యత్నం చేశారు. తాను పసుపు బోర్డు తీసుకురాలేకపోతే రాజీనామా చేస్తానని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అప్పుడు సవాల్ చేశారు. ఇప్పుడు ఆ సవాల్ ఆయనకు పెద్ద చిరాకు తెచ్చిపెట్టింది. పసుపు బోర్డు విషయంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేకపోయిన అరవింద్ ఇప్పుడు రాజీనామా చేయాలంటూ పెద్ద ఎత్తున డిమాండ్ వినిపిస్తోంది. ఎంపీ అరవింద్ రైతులను మోసం చేశాడని టిఆర్ఎస్ నేతలు ఆరోపి స్తున్నారు. నిజామాబాద్ ప్రజలు అరవింద్‌ను తరిమికొట్టే రోజులు వచ్చాయని అంటున్నారు. పసుపు రైతులకు ధర్మపురి అరవింద్ సమాధానం చెప్పాలని స్థానిక ఎమ్మెల్యే జీవన్ రెడ్డి లాంటి వారు డిమాండ్ చేస్తున్నారు. మొత్తానికి పసుపు బోర్డు దుమారం ఎంపీ ధర్మపురి అరవింద్ మెడకు చుట్టుకుంది. దీనిపై కేంద్ర మంత్రుల ప్రతిపాదన లేదని తేల్చి చెప్పడంతో, పసుపు రైతులకు అరవింద్ ఏం సమాధానం చెబుతారో వేచి చూడాలి. పసుపు బోర్డు ఏర్పాటు హామీతో నిజామా బాద్ లోక్‌సభ స్థానాన్ని గెలిచిన భారతీయ జనతా పార్టీ మాటలన్నీ అబద్దాలనేనని తేలిపోయింది. బోర్డు ఏర్పాటు ప్రక్రియ కాదని తెలిసినప్పటికీ రైతులను మాయమాటలతో మోసగించినట్లు స్పష్టమైందని జీవన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేనటువంటి అంశాన్ని రైతులకు ఆపాదించి, బోర్డు పేరుతో ఆశ చూపి ఓట్లు వేయించుకున్న ధర్మపురి అర్వింద్ మాటలన్నీ అబద్ధాలేనని తేలిపోయిందన్నారు.నిజామాబాద్ ఎంపీ పదవికి అర్వింద్ రాజీనామా ఒక్కటే మిగిలిపోయిందని మండిపడ్డారు. ఇప్పటికే ఎంపీకి వ్యతిరేకంగా పోరుబాట పట్టిన రైతన్నలంతా రాజీనామా చేయాలంటూ ముక్తకంఠంతో డిమాండ్ చేస్తుండగా మాటల గారడీతో ఎంపీ అర్వింద్ కాలాన్ని వెల్లదీస్తూ వస్తున్నారు. గతంలో పలు మార్లు నేరుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసిన మాజీ ఎంపి కవిత పసుపుబోర్డు కోసం విన్నవించారు.

ఏప్రిల్ 1 నుంచి బ్యాంకుల్లో కొత్త రూల్స్.. అవేంటంటే..?

న్యూఢిల్లీ, మార్చి16: కొత్త ఆర్థిక సంవత్సరం వచ్చేస్తున్నది. వస్తూవస్తూ తనతోపాటు కొన్ని కొత్త నిబంధనలను కూడా వెంట తెస్తున్నది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం (ఏప్రిల్ 1) నుంచి కొత్త నిబంధనలు అమలులోకి రానున్నాయి. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో కొత్త నియమాలను అమలు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం 8 ప్రభుత్వ రంగ బ్యాంకుల్ని విలీనం చేసి 3 బ్యాంకులుగా మార్చిన నేపథ్యంలో పాత బ్యాంకులకు సంబంధించిన పాస్‌బుక్కులు, చెక్‌బుక్కులు ఏప్రిల్ 1 నుండి పనిచేయవనే విషయాన్ని వినియోగదారులు గుర్తించాలి. విజయా బ్యాంక్, దేనా బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంకులకు చెందిన వినియోగదారులు.. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తమ పాస్‌బుక్‌లు, చెక్‌బుక్కులతో పాటు ఐఎఫ్ఎస్‌సీ, ఎంఐసీఆర్ కోడ్ వంటివి కూడా మారనున్నాయని తెలుసుకోవాలి.

ఈ బ్యాంకులు ఇతర బ్యాంకులతో విలీన ప్రక్రియ 2019 ఏప్రిల్ 1, 2020 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చాయి. విలీనం చేసిన బ్యాంకుల కస్టమర్లు.. తమ మొబైల్ నంబర్, చిరునామా, నామినీ మొదలైన వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. తద్వారా ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుంది. అయితే, సిండికేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్ కస్టమర్లకు కొంత ఉపశమనం లభించింది. సిండికేట్ బ్యాంక్ ఖాతాదారుల ప్రస్తుత చెక్ బుక్స్ 2021 జూన్ 30 వరకు చెల్లుబాటు అవుతాయని బ్యాంకు ప్రకటించింది. కొత్త చెక్‌బుక్కు, పాస్‌బుక్కు పొందిన తర్వాత.. మ్యూచువల్ ఫండ్స్, ట్రేడింగ్ అకౌంట్స్, లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ, ఆదాయపు పన్ను ఖాతా, ఎఫ్డీ / ఆర్డీ, పీఎఫ్ ఖాతా, బ్యాంక్ ఖాతాలు వంటి వాటిలో కూడా వినియోగదారులు తమ సమాచారాన్ని అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది.ఇంకా అంతేకాకుండా ఆదాయపు పన్ను విషయంలో కూడా కొన్ని మార్పులు రానున్నాయి. ఏప్రిల్ 1 తర్వాత 75 ఏండ్ల వయసు పైన ఉన్నవారు ఆదాయపు పన్ను రిటర్న్ ఫైల్ చేయాల్సిన అవసరం లేదు. పెన్షన్ ద్వారా, ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వడ్డీ ద్వారా ఆదాయాన్ని పొందుతున్నవారికి ఇది వర్తిస్తుంది. ఇక ఉద్యోగస్తులకు ఏప్రిల్ 1 నుంచి కొత్త వేతన కోడ్ అమలులోకి రానున్నది. ఈ కోడ్ ద్వారా బేసిక్ పే పెంచనున్నారు. దీంతో బేసిక్ పే పెరిగితే అందులో 12 శాతం పీఎఫ్ అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంటుంది. పీఎఫ్ పెరిగితే ఉద్యోగస్తుల టేక్ హోమ్ సాలరీ తగ్గుతుందని గుర్తించాలి. వీటితో పాటు ఏప్రిల్ 1 నుంచి టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లు కూడా పెరుగనున్నాయి.

ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ

సమ్మెతో మూతపడ్డ బ్యాంకులు
దేశవ్యాప్తంగా నిలిచిపోయిన లావాదేవీలు

న్యూఢిల్లీ,మార్చి 16(ఆర్ఎన్ఎ): ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేటీకరించాలన్న కేంద్ర సర్కార్ నిర్ణయానికి వ్యతిరేకంగా పది ప్రభుత్వరంగ బ్యాంకులకు చెందిన పది లక్షల మందికి పైగా ఉద్యోగులు సోమవారం నుంచి రెండు రోజుల సమ్మెలో పాల్గొంటున్నారు. తొలిరోజు సమ్మెలో అన్ని బ్యాంకులు మూతపడ్డాయి. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బ్యాంకుల ముందు ధర్నాకు దిగారు. సమ్మె వల్ల వివిధ బ్యాంకుల శాఖల వద్ద నగదు విత్‌డ్రాయల్స్, డిపాజిట్లు, చెక్ క్లియరెన్స్, రుణాలకు ఆమోదం వంటి లావాదేవీలు నిలిచి పోయాయి. అయితే, ఏటీఎంల్లో మాత్రం నగదు అందుబాటులో ఉంది. సోమవారం సంబంధిత బ్యాంకుల శాఖల నుంచి ఏటీఎంల్లో నగదు నింపుతున్న ఏజెన్సీలకు ఉద్యోగులు సమ్మెలో కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం ఏటీఎంల్లో నగదు నింపడం కష్ట సాధ్యం కావొచ్చునన్న అభిప్రాయాలు వినిపి స్తున్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వ సంస్థ నీతి ఆయోగ్.. బ్యాంకుల ప్రైవేటీకరణపై సర్కార్ విధాన నిర్ణయాన్ని బయటపెట్టింది. ఆరు ప్రధాన ప్రభుత్వ రంగ బ్యాంకులను మాత్రం ప్రైవేటీకరించొద్దని కేంద్రం నిర్ణయానికి వచ్చినట్లు నీతి ఆయోగ్ వర్గాలు తెలిపాయి. ఆ జాబితాలో అతిపెద్ద ప్రభుత్వ రంగ వాణిజ్య బ్యాంకు... భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ)తోపాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ), యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా ఉన్నాయి. ఇప్పటికే రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులను, ఒక జీవిత బీమా సంస్థను ప్రయివేటీకరించాలని నిర్ణయం తీసుకున్న కేంద్ర ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిర్ణయం తీసుకునే అవకాశం అవకాశం ఉంది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్మెంట్ (దీపం) త్వరలో ఈ అంశాన్ని మంత్రుల గ్రూప్ ముందుకు తీసుకెళ్లనున్నది.

2019లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ)లో ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్‌లో అలహాబాద్ బ్యాంక్, కెనరాబ్యాంకులో సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆంధ్రాబ్యాంక్, కార్పొరేషన్ బ్యాంకులు విలీనం అయ్యాయి. ఇక భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) సర్దుబాటు చర్యల ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్‌లు ప్రైవేటీకరణ జాబితాలో ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం ఆర్థిక ఫలితాలను ప్రకటించిన తర్వాత ఈ బ్యాంకుల భవితవ్యాన్ని ఆర్బీఐ సమీక్షించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఇప్పటికే ఈ ఫ్రేమ్‌వర్క్ నుంచి ఐడీబీఐ బ్యాంక్ బయటకు వచ్చింది.

దేశాన్ని క్యాప్టలిస్టులకు తాకట్టు

మోడీ విధానాలతో దేశానికి ప్రమాదం: ఉండవల్లి

రాజమండ్రి,మార్చి16(ఆర్ఎన్ఎ): దేశాన్ని క్యాపిటలిస్ట్‌లకు అప్పగించాలనేది బీజేపీ సిద్ధాంతమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం రాజమండ్రిలో బ్యాంక్ యూనియన్ల నిర్వహిస్తున్న సమ్మెకు ఉండవల్లి అరుణ్ కుమార్ మద్దతు తెలిపారు.

ఈసందర్భంగా ఉండవల్లి మాట్లాడుతూ.. సమ్మెలు, ఉద్యమాలు మోదీ ప్రభుత్వం లెక్కచేయదని.. పంజాబ్ రైతుల ఆందోళనతో తేలిపో యిందని చెప్పారు. మోదీ ప్రభుత్వంపై మేధోతనంతోనే పోరాడాలని స్పష్టం చేశారు.

సోషలిస్టు దేశాన్ని క్యాపటలిస్ట్గా మార్చేస్తామని రాజ్యాంగ సవరణ చేయడంపై మోదీ ప్రభుత్వాన్ని నిలదీయాలని అప్పుడే మోదీ ప్రభుత్వం బండారం బయట పడుతుందని ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. మోదీ ప్రధాని అయ్యేనాటికి 46లక్షల కోట్లు ఉన్న మన దేశం అప్పు.. ఇప్పుడు కోటి 7 లక్షలకు చేరుకుందన్నారు. 1969లో ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయకరణ చేయడం వల్లే ప్రపంచ ఆర్థిక సంక్షోభంలోనే మన దేశం నిలబడిందని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వానికి పరిపాలన చేయడం సాధ్యం కాలేదన్నారు. చివరకు రక్షణ రంగంలోనూ విఫలం కావడంతో నేపాల్ కూడా మనదేశంపై కాలుదువ్వుతోందని ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు.

రాత్రికి రాత్రే మూటా ముల్లే సర్దేస్తున్నారు

మున్సిపల్ ఫలితాలతో రాజధాని మార్చేందుకు కుట్ర
ఎంపి రఘురామ కృష్ణంరాజు మండిపాటు

న్యూఢిల్లీ,మార్చి16(ఆర్ఎన్ఎ): మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను సాకుగా చూపి రాత్రిరాత్రే దుకాణం సర్దేయడానికి సీఎం సిద్ధమవుతున్నారంటూ నర్సాపురం ఎంపీ రఘురామ రాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. తము కోరుకున్న విధంగా రాజధానిని విశాఖకు తరలించేందుకు ఆగమేఘాల మీద ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు తీర్పు ఇచ్చారని... ఇక్కడ రాజధాని వద్దంటున్నారని కోర్టుకు తమ ప్రభుత్వం చెప్పనుందని అన్నారు. ఓ మహానుభావుడు ముహూర్తం పెట్టారట... మూటాముల్లే సర్దుకుని ఆయన వెళ్లిపోతారట. అధికారుల పిల్లలకు స్కూళ్లు, కాలేజీలు, ఇళ్లపై పలు సూచనలు చేశారని సాకుగా చూపి ముందుకు సాగుతున్నారని అన్నారు. ఈ అప్రతిహత విజయాన్నిసాకుగా చూపి... ఇక్కడి నుంచి రాత్రికి రాత్రి దుకాణం కట్టేసి లేచిపోదామని అనుకుంటున్నారు. మీడియాలో వస్తున్న కథనాల ప్రకారం రాత్రికి రాత్రే లేచిపోవడానికి ప్లాన్ చేస్తున్నారు. లీగల్‌గా ఇది చెల్లదు. వందలాది సలహాదారులు మీకు సలహా ఇవ్వడం లేదా? 20 సార్లు ముహూర్తం పెట్టారు. మధ్యలోనే ఆగిపోయాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ సెక్రటేరియట్ అనేది ఇక్కడే ఉంటుంది. అత్యంత దారుణంగా డబ్బులు వృథా అవుతున్నాయి. ఆఖరుకి నా నియోజకవర్గానికి వెళ్లాలంటే.. రూరల్ గృహనిర్మాణ శాఖ మంత్రి శ్రీరంగనాథ వర్మ ఆదేశాలతో ఏడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన మంత్రి కొప్పుల

హైదరాబాద్, మార్చి 16: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆపన్నహస్తం అందించారు. చెవి నొప్పి, వినికిడి లోపంతో ఇబ్బంది పడుతున్న నగరంలోని అంబర్‌పేట నివాసి కె.సంజీవరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంత్రి కొప్పుల రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. అలాగే జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన గొర్రెల నరేష్ కుమారుడు మోక్షిత్ అనారోగ్యానికి గురయ్యాడు సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన మంత్రి రూ.3 లక్షల ఎల్వోసీ మంజూరు చేయించారు. మంత్రి హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం సంజీవ రావు, మోక్షిత్ తండ్రి నరేష్‌కు ఇందుకు సంబంధించిన పత్రాలను అందజేశారు.

వ్యాక్సిన్ ఎగుమతుల్లో దేశ అవసరాలే ముఖ్యం

నిపుణుల పర్యవేక్షణలోనే నిర్ణయం ఉంటుంది
రాజ్యసభకు వెల్లడించిన కేంద్రమంత్రి హర్షవర్ధన్

న్యూఢిల్లీ,మార్చి16(ఆర్ఎన్ఎ): దేశ ప్రజల అవసరాలను పణంగా పెట్టి కరోనా వైరస్ వ్యాక్సిన్లను విదేశాలకు ఎగుమతి చేయబోమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ స్పష్టం చేశారు. దేశంలోని ప్రజలకు ముందుకు వ్యాక్సిన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.వ్యాక్సిన్ సరఫరాలు, ఎగుమతులపై అత్యున్నత ప్రభుత్వ కమిటీ, నిపుణుల కమిటీల పర్యవేక్షణలో సమతూకం పాటించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ 3.29 కోట్ల మందికి కరోనావైరస్ వ్యాక్సిన్ డోసులు వేశామని మంగళవారం రాజ్యసభలో మాట్లాడుతూ మంత్రి తెలిపారు. ఇక గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 24,492 తాజా కొవిడ్ కేసులు నమోదయ్యాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. మహారాష్ట్ర, పంజాబ్, కర్ణాటక, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. దేశవ్యాప్తంగా నమోదవుతున్న తాజా కేసుల్లో 80 శాతం ఈ రాష్ట్రాల్లోనే వెలుగుచూస్తున్నాయి. ఇక భారత్ బయోటెక్ కొవాగ్జిన్, ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెనెకా అభివృద్ధి చేసిన కోవిషీల్డ్ వ్యాక్సిన్‌లకు భారత్ ఆమోదం తెలిపిన తర్వాత లక్షలాది వ్యాక్సిన్ డోసులను గ్రాంట్ సాయం కింద పలు దేశాలకు పంపగా, మరికొన్ని దేశాలు భారత్ నిర్ణయించిన ధరకు వ్యాక్సిన్లను దిగుమతి చేసుకున్నాయి.

చంద్రబాబుపై కేసుల వెనక కుట్ర

-కేవలం రాజకీయ కుట్రతోనే సిఐడి నోటీసులు: బ్రహ్మం

అమరావతి,మార్చి16(ఆర్ఎన్ఎ): జగన్ దొంగ కనుక అందరూ దొంగలే అన్న చందంగా ఆయన వ్యవహారం ఉందని టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బ్రహ్మం ఎద్దేవా చేశారు. చంద్రబాబుపై కేసులు పెట్టడం వెనక కుట్ర ఉందన్నారు. కేవలం రాజకయా కక్షతోనే ఈ తతంగం నడుస్తోందని అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్ తాత్కాలిక ఆనందం కోసం తాపత్రయం పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ముందు తాను నీతిమంతుడినని నిరూపించుకున్న తర్వాత ఇతరుల మీద బురద చల్లాలని చెప్పారు. రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతూ చంద్రబాబుని వేధించాలన్న తలంపుతోనే జగన్ ఈవిధంగా వ్యవహరిస్తున్నాడని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చెయ్యడం ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని మండిపడ్డారు. అసైన్డ్ భూముల ఆక్రమణ

ఆస్ట్రాజెన్‌కా సమర్థతపై ఆందోళనలు

అత్యవసరంగా సమీక్షకు సిద్ధమైన ప్రపంచ ఆరోగ్య సంస్థ
ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ గెబ్రేయేసన్

జెనీవ,మార్చి16(ఆర్ఎన్ఎ): ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్ తీసుకున్న పలువురిలో రక్తం గడ్డకడుతున్నట్లు వార్తలు రావడంతో పలు దేశాలు ఇప్పటికే వ్యాక్సిన్‌పై నిషేధం విధించాయి. ప్రస్తుతం పలుదేశాల్లో టీకా పంపిణీ కొనసాగుతున్న నేపథ్యంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో వ్యాక్సిన్ భద్రతపై చర్చించేందుకు నిపుణుల కమిటీ మంగళవారం సమావేశం కానున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ గెబ్రేయేసన్ తెలిపారు. వ్యాక్సిన్ భద్రతపై ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహా కమిటీ అందుబాటులో ఉన్న డేటాను సమీక్షిస్తోందని పేర్కొన్నారు. టీకా వినియోగం, సమర్థతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్‌పై గురువారం 'అసాధారణ సమావేశం' నిర్వహించనున్నట్లు యూరోపియన్ యూనియన్ మెడిసిన్స్ ఏజెన్సీ తెలిపింది. సేకరించిన సమాచారం, ఇంకా తీసుకోవాల్సిన చర్యలపై తీర్మానించేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొంది. జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ సోమవారం ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్ల పంపిణీని నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. వైరస్‌తో తీవ్రంగా పోరాడుతున్న యూరప్‌లో టీకా భద్రతపై జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో వ్యాక్సినేషన్‌పై గందరగోళం నెలకొంది.

మొదట డెన్మార్, నార్వే దేశాలు రక్తం గడ్డకట్టడం, తక్కువ ప్లేట్‌లెట్స్ లెక్కింపు కేసులను గుర్తించడంతో వ్యాక్సిన్ పంపిణీని నిలిపివేసింది. అనంతరం ఐర్లాండ్, థాయ్‌లాండ్, నెదర్లాండ్స్, నార్వే, ఐస్‌లాండ్, కాంగో, బల్గేరియా తదితర దేశాలు కూడా వ్యాక్సిన్ వినియోగంపై తాత్కాలిక నిషేధం విధించాయి. అయితే తమ టీకా సురక్షితమైనదేనని ఆస్ట్రాజెనెకా తెలిపింది. వ్యాక్సిన్ రక్తం గడ్డకట్టడానికి తమ టీకా తీసుకోవడమే కారణమని ఇంతవరకూ ఒక్క ఆధారం లేదని పేర్కొంది. ఇదిలావుంటే ఆక్స్‌ఫర్డ్, ఆస్ట్రాజెన్‌కా తయారు చేస్తున్న కోవిడ్ టీకాకు చాలా వరకు యూరోప్ దేశాలు నిషేధించాయి. ఆ టీకాను వేసుకోవడం లేదని ఇప్పటికే కొన్ని దేశాలు స్పష్టం చేశాయి. ఆ టీకా తీసుకోవడం వల్ల రక్తం గడ్డకడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ సైంటిస్ట్ సౌమ్యా స్వామినాథన్ ఓ సూచన చేశారు. ప్రస్తుతం ఆస్ట్రాజెన్‌కా టీకాను వాడుతూనే ఉండాలని ఆమె తెలిపారు. ఆస్ట్రాజెన్‌కా టీకా వినియోగంపై పూర్తి స్థాయిలో సమీక్ష చేస్తున్నామని, ప్రజలు ఎవరూ ఆందోళనకు గురికావొద్దు అని ఆమె తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో.. అన్ని దేశాలు ఆస్ట్రాజెన్‌కా టీకాను తీసుకోవడం ఆపవద్దు అంటూ ఆమె తన సూచనల్లో తెలిపారు. ఆస్ట్రాజెన్‌కా టీకాను తీసుకుంటూనే ఉండాలంటూ సౌమ్యా స్వామినాథన్ తన ట్వీట్‌లో తెలిపారు. ఏ వ్యాక్సిన్ అయినా లేక మందు అయినా.. వంద శాతం సురక్షితంగా ఉండవన్నారు. లక్షల్లో ఎవరో ఒకరికి ఏదో ఒకటి జరుగుతుందని, కానీ లక్షల మందిని చంపేస్తున్న వైరస్ నుంచి రక్షణ పొందేందుకు టీకా అవసరమన్నారు. మరోవైపు ఇవాళ డబ్ల్యూహెచ్‌వోకు చెందిన ప్రత్యేక బృందం.. ఆస్ట్రాజెన్‌కా వినియోగంపై సమీక్ష చేయనున్నది.

చంద్రబాబు మెడకు అమరావతి భూముల వ్యవహారం

కేబినేట్ ఆమోదం లేకుండానే అసైన్డ్ భూముల పూలింగ్
చంద్రబాబు, మాజీమంత్రి నారాయణలకు నోటీసులు
సిఐడి కేసు నమోదు.. 23న విచారణకు రావాల్సిందే ఆదేశాలు

అమరావతి/హైదరాబాద్,మార్చి16 (ఆర్ఎన్ఎ): ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల్లో ఘోర పరాభవం పాలైన టిడిపికి మరో షాక్ తగిలింది. దాని నుంచి తేరుకోక ముందే హైదరాబాద్‌లో ఉన్న టిడిపి అధినేత చంద్రబాబు నివాసానికి ఎపి సిఐడి అధికారులు వెళ్లి నోటీసులు జారీ చేశారు. అమరావతిలో భూముల కొనుగోలు, అమ్మకాల వ్యవహారంపై 41 సిఆర్‌పిసి కింద నోటీసులు ఇచ్చినట్లు సిఐడి చీఫ్ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 23న విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. చంద్రబాబుపై 120బి, 166, 167, 217 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. చంద్రబాబుతో పాటు మాజీ మంత్రి నారాయణకు సిఐడి అధికారులు నోటీసులు జారీ చేశారు. 500 ఎకరాల అసైన్డ్ భూముల బదలాయింపు, కేబినెట్ ఆమోదం లేకుండానే భూములను ల్యాండ్‌పూలింగ్‌లో చేర్చడంపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. సరిగ్గా మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన రెండు రోజులకు ఈ నోటీసులు జారీ చేయడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అమరావతి భూ కుంభకోణం కేసుకు సంబంధించి సీఐడీ అధికారులు చంద్రబాబు నాయుడుకి నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి దీనికి సంబంధించిన నోటీసులను అందజేశారు. ఈ నెల 23న విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అమరావతి భూ కుంభకోణం వ్యవహారంలో ఇప్పటికే ఐపీసీ సెక్షన్లు 120 బీ, 166, 167, 217, ప్రొహిబిషన్ ఆఫ్ అసైన్డ్ ల్యాండ్స్ అలినేషన్ యాక్ట్ 1977, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసులు నమోదు అయ్యాయి. కేబినెట్ ఆమోదం లేకుండానే ఈ భూములను ల్యాండ్‌పూలింగ్‌లో చేర్చడానికి జీవో ఇచ్చారని ప్రధాన అభియోగం మోపారు సీఐడీ అధికారులు. వాస్తవంగా దళితులకు కేటాయించిన ఈ భూములను రాజధాని ప్రకటనకు ముందు కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఈ అసైన్డ్ భూముల కొనుగోళ్లను వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌లో క్రమబద్ధీకరణ చేయడానికి అనుమతించారు. ఈ క్రమంలో అధికారుల అభ్యంతరాలను, సూచనలను పట్టించుకోకుండా చంద్రబాబు నిర్ణయం తీసుకున్నాడనే ఆరోపణలు వచ్చాయి. విజయవాడ నుంచి ఉదయం 8 గంటలకు రెండు బృందాలుగా హైదరాబాద్ వచ్చిన సీఐడీ అధికారులు జూబ్లీహిల్స్ లోని బాబు నివాసానికి వెళ్లి నోటీసులిచ్చారు. దీనిపై అటు చంద్రబాబు కానీ.. ఇటు నారాయణ కానీ ఇంతవరకూ స్పందించలేదు. కాగా.. టీడీపీ హయాంలో నారాయణ పురపాలక శాఖ మంత్రిగా పనిచేసిన సంగతి తెలిసిందే. రాజధాని ప్రకటనకు ముందే తన అనుచరులకు సమాచారం ఇచ్చి అక్కడ దళితులకు చెందిన అసైన్డు భూములు కొనుగోలు చేశారనే ఆరోపణలతో కేసు నమోదు అయినట్లు సమాచారం. అసైన్డ్ రైతులను మోసం చేసి తన అనుచరులకు లబ్ది కలిగించారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై హైకోర్టులో కూడా విచారణ జరిగింది. ఈ విషయంలో చంద్రబాబుకు



సంబంధం లేదంటూ న్యాయస్థానం చెప్పింది. కాగా.. రాజధాని ప్రకటన తర్వాత భూముల ధరలు విపరీతంగా పెరిగాయని.. అసైన్డ్ రైతులు మోసపోయి.. అనుచరులకు లబ్ది కలిగించారని కేసు నమోదు చేయడం జరిగింది. మరోవైపు టీడీపీ నేతలు మీడియా ముందుకొచ్చి ఈ నోటీసుల వ్యవహారాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు.

సిఐడి కేసులపై మండిపడ్డ టిడిపి

తప్పుడు కేసులతో చంద్రబాబును బయటపెట్టే చర్య
చూస్తూ ఊరుకునేది లేదన్న పార్టీ సీనియర్లు

అమరావతి,మార్చి16(ఆర్ఎన్ఎ): మాజీ సిఎం చంద్రబాబుపై ఎపి ప్రభుత్వం సిఐడి కేసులు పెట్టడాన్ని టిడిపి తీవ్రంగా ఖండించింది. ఇది బెదిరింపు ధోరణి అంటూ పలువురు నేతలు మండిపడ్డారు. తప్పుడు కేసులతో టీడీపీ అధినేత చంద్రబాబును భయపెట్టాలను కుంటున్నారని టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య పేర్కొన్నారు. రెండేళ్లలో ఏమీ చేయలేని జగన్ సర్కార్.. ఇప్పుడు ఏం చేస్తుందని ప్రశ్నించారు. రెండ్రోజుల నుంచి జగన్ క్యాంప్ భయపడుతోందన్నారు. జైలుకు వెళ్లాల్సివస్తుందనే భయంలో సీఎం జగన్ ఉన్నారని విమర్శించారు. ఏ1, ఏ2 బెయిల్ రద్దయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఏపీ సీఎంపై ఉన్న కేసులు దేశంలో ఏ ముఖ్యమంత్రులపై లేవని వర్ల రామయ్య పేర్కొన్నారు. రాజకీయ కక్ష సాధింపుల కోసమే టీడీపీ అధినేత చంద్రబాబుకు నోటీసులు జారీ చేశారని టీడీపీ నేత బోండా ఉమ విమర్శించారు. 21 నెలలుగా వైసీపీ సర్కార్ ఏం చేసిందని ప్రశ్నించారు. ఇన్‌సైడ్ ట్రేడింగ్‌పై ఇప్పటికే హైకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చిందన్నారు. వైసీపీ బెదిరింపులకు భయపడేది లేదన్నారు. దీనిపై హైకోర్టులో న్యాయ పోరాటం చేస్తామని బోండా ఉమ వెల్లడించారు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నోటీసులు ఇవ్వడాన్ని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ ఖండించారు. మంగళవారం మీడియా సమావేశంలో గల్లా మాట్లాడుతూ.. కేవలం ఇదీ కక్ష్య సాధింపు కోసమే నోటీసులు ఇస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎలాగైన చంద్రబాబుపై బురద చల్లాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తాను జైలుకు వెళ్లాడని.. తన దారిలో అందరు జైలుకు వెళ్లాలనే జగన్ ఆలోచన కరెక్ట్ కాదని గల్లా జయదేవ్ విమర్శించారు.తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఏపీ సీఐడీ నోటీసులివ్వడాన్ని ఖండిస్తున్నామని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ చంద్రబాబును ఏదో విధంగా కేసులో ఇరికించి ఇబ్బంది పెట్టాలని సీఎం జగన్ చూస్తున్నారని విమర్శించారు. కక్ష్య సాధింపు చర్యల్లో భాగమే ఈ నోటీసులు ఇచ్చారన్నారు. రాజకీయాల్లో ఎవరూ శాశ్వతం కాదన్న విషయం తెలుసుకోవాలన్నారు. చంద్రబాబును మానసికంగా బాధపెట్టాలనే ఆలోచనతోనే ఈ చర్యలు చేపట్టారన్నారు. ఇలాంటి ప్రభుత్వం ఉంటే భవిష్యత్తు లేదనేది ప్రజలు గమనిం చాలన్నారు. జగన్‌రెడ్డిని గద్దె దించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బుద్దా వెంకన్న వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఏపీ సీఐడీ నోటీసులివ్వడాన్ని ఖండిస్తున్నామని టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బచ్చయ్య చౌదరి అన్నారు.జగన్ ప్రభుత్వ కక్ష్య సాధింపు చర్యలకు ఇది పరాకాష్టని అన్నారు. రాజధానికి సంబంధించి అంతా సాఫీగా నడిచిందని, ఇప్పుడు అమరావతి కోసం రైతులు పోరాటం చేస్తున్నారని అన్నారు. దాన్ని పక్కదోవ పట్టించేందుకు తప్పుడు కేసులు పెట్టి.. కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందని, ఇందులో చంద్రబాబుకు ఎటువంటి సంబంధంలేదని న్యాయస్థానం పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయినా చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నం సీఎం జగన్ చేస్తున్నారని విమర్శించారు. అక్రమాస్తుల్లో 16 నెలలు జైల్లో ఉన్న జగన్... ఇవాళ కేంద్రం దయాదాక్షిణ్యాలతో బెయిల్‌పై బయట తిరుగుతున్నారని అన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబుపై తప్పుడు ఆరోపణలతో కేసుపెడుతున్నారని, ఇది నిలబడదని గోరంట్ల వ్యాఖ్యానించారు.

నీట్ రద్దు, మద్యం షాపుల మూసివేతకు కాంగ్రెస్ హామీ!

చెన్నై మార్చి 16: విద్యా సంస్థల్లో అడ్మిషన్లకు జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ పరీక్షల రద్దుతో మద్యం దుకాణాలను మూసివేస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ మంగళవారం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ప్రతి జిల్లా కేంద్రంలో 500 మంది యువకులకు ప్రభుత్వ ఉద్యోగాల కోసం శిక్షణ ఇస్తామని మేనిఫెస్టోను విడుదల చేస్తూ టీపీసీసీ చీఫ్ కేఎస్ అళగిరి పేర్కొన్నారు.

స్టార్టప్‌లు, నూతన ఎంట్రప్రెన్యూర్‌లను ప్రోత్సహించేందుకు ఆయా సంస్థలకు ఐదేండ్ల పాటు పన్ను మినహాయింపు ఇస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యం దుకాణాలను మూసివేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలను కాపాడేందుకు చర్యలు చేపడతామని పరువు హత్యల నియంత్రణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. తమిళనాడులో శాసనమండలిని తిరిగి ప్రవేశపెడతామని, స్థానిక సంస్థల బలోపేతానికి చర్యలు చేపడతామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో స్పష్టం చేసింది.

మంగళవారం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ

సంసారం ఒక వృక్షంలాంటిది

తిరుమల,మార్చి16(ఆర్ఎన్ఎ): సంసారం ఒక వృక్షంలాంటిదని, ఆ చెట్టుకు దినదిన ప్రవర్ధమానం అయ్యే కొమ్మలు సంతానాల వంటివని, కొమ్మలు ఎంతగా విస్తరిస్తే కుటుంబాలు అంతగా కళకళలాడతాయనే భావనతోనే వంశాన్ని వృక్షంగా పోలుస్తూ ప్రాచీనులు 'వంశవృక్షం' అన్నారు. నేడు వృక్షశాఖలను ఖండించినట్లే వంశ శాఖలను కూడా ఖండిస్తూ, మనిషి తన ఉనికిని పోగొట్టుకుంటున్నాడు!ఏ చెట్టును ఆశ్రయించినా మనిషికి ఏదో ఒక ఫలం లభిస్తుంది కనుక చెట్లు మానవాళిని నిరాశగా వెళ్ళనీయవని కవులు వర్ణించారు. ఓషధీ గుణాలతో అలరారే చెట్లలోని ప్రతిభాగమూ అమూల్యమైందే. రెమ్మలు, ఆకులు, బెరడు, కాయలు, పుల్లలు, పండ్లు... ఇలా అన్నీ మనిషికి ఉపయోగపడేవే. చెట్ల నీడలో ప్రాణులన్నీ సేదదీరుతాయి. చెట్ల కాండాలను ఆశ్రయించుకొని పలువిధాల పక్షులు, కీటకాలు, పురుగులు బతుకుతుంటాయి. ఆకాశంలో ఆహారం కోసం అన్వేషిస్తూ సాగే విహంగాలు, అలసటతో సేదదీరేందుకు చెట్ల పై భాగాలను ఆశ్రయిస్తాయి. ఒక చెట్టు సకలప్రాణి ప్రపంచానికి ప్రతిరూపం. క్రూరమృగాలు సైతం చెట్లను ఆశ్రయించి, జీవిస్తుంటాయి.

మున్సిపల్ ఫలితాలతో హీరోగా అవతరించిన జగన్

-మంత్రి సిదిరి అప్పలరాజు ఆనందం

అమరావతి,మార్చి16(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ఫలితాల ద్వారా దేశ రాజకీయాల్లో హీరోగా సిఎం వైఎస్ జగన్ అవతరించారని మంత్రి సిదిరి అప్పలరాజు అన్నారు. ఎన్నికలు జరిగిన ఏ సందర్భంలోనైనా వైసిపి విజయం సాధిస్తోందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు అవుతోందని, రిఫరెండమ్‌గా భావించే ఈ ఎన్నికల్లో ప్రజలు జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించారని అన్నారు. సిఎం చిత్తశుద్ధితో, నిజాయితీతో పరిపాలన అందిస్తూ ముందుకు వెళ్తున్నారని చెప్పారు. ప్రతిపక్షాలు, చంద్రబాబు ఎన్నో అవాంతరాలు సృష్టించారని, కులాలు, మతాలు, ప్రాంతీయ అసమానతలు రెచ్చగొట్టారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ వరకు ప్రచారం చేశారని, ఈ ఎన్నికల్లో వైసిపి తరుపున పార్టీ అధ్యక్షుడు, సిఎం జగన్ ఎటువంటి ప్రకటనా, ప్రచారమూ చేయలేదని గుర్తు చేశారు. తన పరిపాలన చూసి ప్రజలు స్వచ్ఛందంగా ఓటేయాలని సిఎం నమ్మారని అన్నారు. ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు వైసిపి మాత్రమే గెలిచిందని, అందుకే దేశ రాజకీయ చరిత్రలో సిఎం జగన్‌ను హీరోగా అభివర్ణిస్తున్నానని అప్పలరాజు అన్నారు.

ఎప్రిల్‌లో భారత్ పర్యటనకు బ్రిటన్ ప్రధాని

-యూకే వాణిజ్య బంధం లక్ష్యంగా బోరిస్ పర్యటన

లండన్,మార్చి16(ఆర్ఎన్ఎ): బ్రిగ్జిట్ అనంతర పరిస్థితుల్లో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో యూకే వాణిజ్య అవకాశాలను పెంచుకునే ప్రయత్నాల్లో భాగంగా బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఏప్రిల్‌లో భారత్‌లో పర్యటించనున్నారు. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ నిష్క్రమించిన తర్వాత బోరిస్ తొలి అంతర్జాతీయ పర్యటన ఇదే కానుంది. ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలను వేగవంతం చేసే ప్రయత్నాల్లో భాగంగా జనవరిలోనే భారత పర్యటనకు సిద్ధమయ్యారు. కరోనా ఉధృతి పెరగడంతో రద్దు చేసుకున్నారు. అంతకు ముందు జనవరిలో రిపబ్లిక్ డేకు ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉన్నా పర్యటన రద్దయింది. ఈ ఏడాది జూన్‌లో బ్రిటన్‌లోని కార్న్‌వాల్ ప్రాంతంలో జీ7 సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సదస్సుకు ముందే ఇండియాలో పర్యటించాలని బోరిస్ జాన్సన్ భావిస్తున్నారు. రాబోయే సంవత్సరాల్లో ఇండో-పసిఫిక్ ప్రాంతం వైపు దృష్టి సారించనున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం తెలిపింది. బ్రెగ్జిట్ అనంతర వాణిజ్యం, ప్రభావానికి కొత్త మార్గాలు తెరిచేందుకు 11 దేశాల కూటమి (కాంప్రిహెన్సివ్ అండ్ ప్రొగ్రెసివ్ ట్రాన్స్-పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్ సీపీటీపీపీ)లో చేరేందుకు గత నెలలో దరఖాస్తు చేసింది.

స్పీకర్‌తో బిజెపి ఎమ్మెల్యేల భేటీ

హైదరాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ):స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని బీజేపీ ఎమ్మెల్యేలు రఘునందన్ రావు, రాజసింగ్ కలిశారు. సోమవారం బీఏసీ సమావేశానికి ఆహ్వానించకపోవడంపై నిరసన తెలిపారు. సభలో ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న పార్టీగా బిజెపి ఉందన్నారు. తమకు బిఏసిలోకి ఆహ్వానం రాకపోవడం సరికాదన్నారు. అయితే లిఖిత పూర్వకంగా ఇస్తే రూల్స్ పరిశీలించి ఆహ్వానించే విషయాన్ని పరిశీలిస్తామని స్పీకర్ పేర్కొన్నారు. గతంలో రాజసింగ్‌కు ఆహ్వానాలు పంపించినా బీఏసీకి హాజరు కాలేదని స్పీకర్ తెలిపారు. దీనిని పరిశీలించాలని కోరారు.

అసెంబ్లీ నేటికి వాయిదా..నేడు గవర్నర్ ప్రసంగంపై చర్చ

హైదరాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారానికి వాయిదా పడ్డాయి. దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య సహా మాజీ సభ్యుల మృతికి శాసనసభ సంతాపం తెలిపింది. అనంతరం సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు సభ తిరిగి ప్రారంభం కానుంది. నేడు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చ చేపట్టి సమాధానం ఇవ్వనున్నారు. మార్చి 18న బ్జడెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

నకిలీ ప్లేస్‌మెంట్ ఏజెన్సీతో నిరుద్యోగులకు మోసం

- దందాను నడిపిస్తున్న ఏడుగురు మహిళల అరెస్ట్

న్యూఢిల్లీ,మార్చి 16(ఆర్ఎన్ఎ): నకిలీ ప్లేస్‌మెంట్ ఏజెన్సీతో నిరుద్యోగులను మోసం చేస్తూ భారీగా దండుకుంటున్న ముఠా గుట్టును రట్టు చేసిన ఢిల్లీ పోలీసులు ఈ దందాను నడిపిస్తున్న ఏడుగురు మహిళలను అరెస్ట్ చేశారు. పశ్చిమ ఢిల్లీలోని కీర్తి నగర్‌లో కిలేడీల నిర్వాకం బయటపడింది. ఎయిర్‌పోర్టుల్లో ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగాలు ఇప్పిస్తామని వీరు యువతను మోసం చేస్తున్నారని పోలీసులు వెల్లడించారు. ఎయిర్‌లైన్ జాబ్స్ ఇప్పించేందుకు వీరు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చార్జి వసూలు చేసేవారని తెలిపారు. కిలేడీల బాగోతంపై సమాచారం అందడంతో కీర్తి నగర్ ప్రాంతంలోని వీరి కార్యాలయంపై పోలీసులు దాడులు చేపట్టారు. అరెస్ట్ చేసిన మహిళలను సుశ్మిత, ఛాయ, ఆకాంక్ష, పూజ, రోష్ని, రేఖ, జ్యోతిగా గుర్తించారు. వీరంతా 30 ఏండ్ల వయసులోపు వారేనని భావిస్తున్నారు. ఉద్యోగార్థులు వీరు ఇచ్చిన నెంబర్లకు కాల్ చేయగానే ఎయిర్‌పోర్టుల్లో మంచి ఉద్యోగాల్లో పెట్టిస్తామని నిందితులు నమ్మబలికేవారని పోలీసులు తెలిపారు. ఇక ముందుగా రూ 2500 రిజిస్ట్రేషన్ చార్జిగా బాధితుల నుంచి వసూలు చేసేవారని ఆపై యూనిఫాం, ఇతర ఖర్చుల కింద మరికొంత మొత్తం వసూలు చేసేవారని చెప్పారు. పలు రకాల పేర్లతో బాధితుల నుంచి భారీ మొత్తాన్ని రాబట్టేవారని పశ్చిమ ఢిల్లీ డీసీపీ వెల్లడించారు. ఎయిర్‌పోర్టుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబుతూ ఒక్కొక్కరి నుంచి మహిళలు రూ 32,000 వరకూ ఆన్‌లైన్‌లో వసూలు చేసేవారని తమకు ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు అందిందని చెప్పారు. పట్టుబడ్డ మహిళలు నేరాన్ని అంగీకరించారని, గత రెండేండ్లుగా దాదాపు 150 మందిని మోసగించినట్టు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. కిలేడీలపై ఐటీ యాక్ట్ సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన ఢిల్లీ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఎపిలో మూతపడ్డ ప్రభుత్వ బ్యాంకులు

ప్రైవీటకరణ చర్యలపై మండిపడ్డ కార్మిక సంఘాలు

అమరావతి,మార్చి 16(ఆర్ఎన్ఎ): ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15, 16 తేదీల్లో తల పెట్టిన బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు ఎపి వ్యాప్తంగా సంఘీభావం వెల్లువెత్తింది. ఎక్కడికక్కడ బ్యాంకులు మూతపడ్డాయి. లావాదేవీలు నిలిచి పోయాయి. విజయవాడ మొదలు వాళ్ళఖాతో పాటు పలు నగరాల్లో కార్యకలాపాలు స్తంభించాయి. దేశంలోని 12 బ్యాంకులను మరో విడత విలీన పేరిట నాలుగు బ్యాంకులుగా కుదించాలని, కేంద్రం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మరో మూడు జాతీయ బ్యాంకుల (బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను ప్రయివేటీకరించాలని కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించారు. వీటిపట్ల దేశ వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో, ప్రభుత్వరంగ బ్యాంకులను కాపాడుకోవడానికి వివిధ బ్యాంకు సంఘాలతో ఏర్పాటైన యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ (యుఎఫ్‌బియు) రెండు రోజులపాటు బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు పిలుపునిచ్చింది.దీంతో ఎపిలోని బ్యాంకులు మూతపడ్డాయి. ప్రభుత్వరంగ సంస్థ ఉద్యోగుల్లోనూ, ఖాతాదారుల్లోనూ విస్తృత ప్రచారం నిర్వహించి సమ్మెకు విశాల మద్దతు కూడగట్టింది. సమ్మెకు కార్మిక, రైతు సంఘాలతోపాటు వామపక్ష పార్టీలు సంఘీభావం తెలిపాయి. బ్యాంకు ఉద్యోగులకు మద్దతుగా కార్మికులు, శ్రామికులు, రైతులు వీధుల్లోకి వచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు ప్రకటించింది. కార్మిక సంఘాలతో కలిసి నిరసనలు తెలుపుతామని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ కూడా సమ్మెకు మద్దతు తెలిపింది. బ్యాంకుల ప్రయివేటీకరణతో డిపాజిట్ల సొమ్ముకు భద్రత లేకుండా పోతుందని సిఐటియు, ఎఐటియుసి తదితర కేంద్ర కార్మిక సంఘాలు విస్తృత ప్రచారం నిర్వహించాయి. కరపత్రాల పంపిణీ, సమావేశాల నిర్వహణ వంటి కార్యక్రమాల ద్వారా బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు ప్రజామద్దతు కూడగట్టాయి. సమ్మెకు మద్దతుగా వామపక్ష శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి.

పసుపు బోర్డు పేరు చెప్పి మోసం చేశారు

రాజీనామా చేసి రైతులతో కలసి పోరాడాలి
ఎంపి ధర్మపురి అర్వింద్‌కు ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సవాల్

హైదరాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ): పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించి, రైతులను మోసం చేసిన బిజెపికి పసుపు రైతుల ఉసురు తగులుతుందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి హెచ్చరించారు. గన్ పార్కు వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ.. గతంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పసుపు బోర్డు విషయంలో బాండ్ రాసారు, బోర్డ్ తీసుకురాకపోతే రాజీనామా చేస్తానని చెప్పారు ..రెండు సంవత్సరాలు అయింది.. పసుపు బోర్డు ఏమయింది.. ఎక్కడొచ్చింది.. అని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో మా ఎంపీలు అడిగితే ..పార్లమెంట్ సాక్షిగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి పసుపు బోర్డు ఇవ్వమని స్పష్టంగా చెప్పారు.. బీజేపీ పార్టీ అంటే అబద్దాల పార్టీ అని మరోమారు వెల్లడైందన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ రాజీనామా చేసి రైతు ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన సూచించారు. ఎంపీ అరవ

చైనాకు చెక్ పెట్టే 'క్వాడ్' కూటమి దేశాల వ్యూహాలు...!

12 మార్చి 2021న జరిగిన క్వాడ్ (క్యాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్, చతుర్భుజ భద్రతా సంభాషణలు)' కూటమి దేశాధినేతల తొలి చారిత్రక వర్చువల్ శిఖరాగ్ర సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ చతుర్భుజ భద్రతా కూటమి భేటీలో ఇండియా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షులు జోసెఫ్ ఆర్ బైడెన్, ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మారిసన్ మరియు జపాన్ ప్రధాని యోశిహిదే సుగా పాల్గొని కరోనా టీకాల తయారీ, ఇండో-పసిఫిక్ ప్రాంతీయ సమస్యలు, వాతావరణ మార్పులపై పోరు, కీలక ఆధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞాన వినియోగాలు లాంటి ఎజెండా అంశాలపై సవివరంగా రెండు గంటల పాటు చర్చించారు. చైనా ఒంటెద్దు పోకడలకు ముకుతాడు వేసే క్రమంలో భాగంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని దేశాలన్నింటికీ వందల కోట్ల టీకా డోసులను అందించేందుకు క్వాడ్ దేశాలు నిర్ణయించడం జరిగింది. చైనా రూపొందించిన కరోనా టీకా 46.3 కోట్ల డోసులను ఇతర దేశాలకు అందుబాటులోకి తేవాలనే చైనా ధోరణులకు గండికొట్టి ఏకాకిని చేయటానికి క్వాడ్ చేసిన ప్రయత్నంగా దీనిని అభివర్ణిస్తున్నారు. క్వాడ్ దేశాల్లో అమెరికా సాంకేతిక పరిజ్ఞాన సహకారం, యూయస్-జపాన్‌ల ఆర్థిక సహాయం, ఆస్ట్రేలియా ఉపరితల రవాణా సహకారం మరియు ఇండియాలో సోవావాక్స్, జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీల సహకారంతో చవకైన, సురక్షిత వందల కోట్ల టీకాల ఉత్పత్తి లాంటి ముఖ్య నిర్ణయాలు తీసుకోవడం ముదావహం. జర్మనీ, ఫ్రాన్స్ లాంటి దేశాలున్న యూరోపియన్ యూనియన్‌తో గతంలో చెడిన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నాలను కూడా క్వాడ్ కూటమి సహాయంతో అమెరికన్ బైడెన్ చేస్తున్నారని అర్థం అవుతోంది. చైనాతో మంచి సంబంధాలు కలిగి ఉన్న దేశాలను తమ వైపుకు ఆకర్షించి చైనాను ఏకాకిగా కట్టడి చేయాలనే క్వాడ్ కూటమి దేశాల పథకాలు ఫలించి, ప్రపంచ శాంతికి ఊతం ఇవ్వనున్నాయి.

2004లో సంభవించిన మానవ విలయ పెను సునామీ విరుచుకుపడి అపార ఆస్తి, ప్రాణ నష్టాన్ని మిగిల్చిన వేళ దేశాల మధ్య పరస్పర సహాయ సహకారంతో మానవీయ సేవలు అందించే సదుద్దేశంతో ఏర్పడిన 'చతుర్భుజ భద్రతా సంభాషణలు, క్వాడ్(క్యాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్)'ల కూటమి వేదికలో ఇండియా, అమెరికా, జపాన్ మరియు ఆస్ట్రేలియా చతురస్రంగా ఏకతాటిపైకి వచ్చాయి. 2007లో మరోసారి ప్రారంభమైన క్వాడ్ కూటమి దేశాల సమావేశాల్లో సముద్ర జలాలతోనే స్వేచ్ఛ మరియు సుసంపన్నతలు ఫలించడానికి కృషి చేయడం జరిగింది. ఈ సమావేశంలో భారత ప్రధాని మన్మోహన్ సింగ్, జపాన్ ప్రధాని షింజో అబే, ఆస్ట్రేలియా ప్రధాని జాన్ హోవర్డ్ మరియు అమెరికా ఉపాధ్యక్షులు డిక్ హోవర్డ్‌లు పాల్గొని 'ఎక్సర్‌సైజ్ మలబార్' పేరుతో సంయుక్త మిలిటరీ విన్యాసాలు మరియు విస్తృత సంప్రదింపులు జరిగాయి. 2008లో చైనా ప్రమేయంతో ఆస్ట్రేలియా క్వాడ్ కూటమికి దూరం జరిగినా మళ్ళీ చేరింది. కొరకరాని కొయ్యగా మారుతున్న చైనా మిలటరీ ఆధిపత్యంతో ప్రతి సరిహద్దు దేశంతో ఏదో ఒక జగడానికి కాలు దువ్వుతున్నది. పొలిమేర దేశాలైన మయన్మార్, బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవ్స్, పాకిస్థాన్ లాంటి దేశాలలో నౌకా స్థావరాలను ఏర్పాటు చేసుకొని భారత్‌ను లొంగదీసుకునే కుయుక్తులు పన్నుతున్నది. ఇలాంటి చైనా దుస్సాహసాలకు చెక్ పెట్టే ఆయుధంగా 'క్వాడ్' కూటమి నిలుస్తుందని అభిప్రాయపడుతున్నారు. 2017లో మరోసారి ఇండియా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, ఆస్ట్రేలియా ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ మరియు జపాన్ ప్రధాని షింజో ఆబేలు పాల్గొని 'మనీలా' భద్రతా ఒప్పందం చేసుకోవడం జరిగింది. 2019లో క్వాడ్ కూటమి దేశాల మంత్రుల స్థాయి సమావేశం సెప్టెంబర్‌లో జరిగింది. కోవిడ్-19 నేపథ్యంలో 2020 నుండి క్వాడ్ కూటమి దేశాలు 'ఎక్సర్‌సైజ్ మలబార్' నావికా విన్యాసాలు చేశారు. 2021 ఫిబ్రవరిలో క్వాడ్ కూటమి దేశాల మంత్రుల స్థాయి సమావేశంలో ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రత మరియు మయన్మార్‌లో సైనిక తిరుగుబాటు లాంటి అంశాలు చర్చించారు. క్వాడ్ కూటమిని 'ఏసియన్ నాటో'గా కూడా అభివర్ణించడం జరుగుతోంది. ప్రపంచ ఆర్థికశక్తిగా ఎదుగుతున్న చైనా అధిపత్యాన్ని అడ్డుకునే వేదికగా క్వాడ్ కూటమి ఏర్పడిందనే అనుకుంటున్నారు. ఆసియా నాటో కూటమిగా క్వాడ్ ఇండో-పసిఫిక్ సముద్ర జలాలపై చైనా పట్టుకు గండికొట్టి శాంతి మరియు సౌభ్రాతృత్వాల స్థాపనకు బాటలు వేయాలని కోరుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

పసుపు బోర్డు కన్న బెటర్ ఎక్స్‌టెన్షన్ బోర్డు

ఉత్తమ్, రేవంత్ కెసిఆర్‌తో మిలాఖత్ అయ్యారు: ధర్మపురి

న్యూఢిల్లీ,మార్చి16(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్‌కి రాష్ట్రంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేంద్రంలో రాహుల్ గాంధీ అధ్యక్షులుగా ఉంటేనే తమకు లాభమని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళ వారం ఆయన మీడియాతో మాట్లాడు తూ.. టీఆర్ఎస్, కాంగ్రెస్ రాజకీయంగా అవగాహనకు వస్తున్నాయని ఈరోజు పార్లమెంట్ సాక్షిగా తేలిపోయిందన్నారు. ఎంపీ రేవంత్ రెడ్డి కూడా సీఎం కేసీఆర్‌కి లొంగిపోయాడని చెప్పారు. పసుపు బోర్డు కంటే మెరుగైనది ఎక్స్‌టెన్షన్ బోర్డు అని.. ఈ బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పార్లమెంట్‌లో స్పష్టం చేశార న్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి కేసీఆర్‌కి బ్రోకర్ అని ఎద్దేవా చేశారు. ఎక్స్‌టెన్షన్ బోర్డు వల్ల ఇప్పటికే చాలా మంది రైతులు లాభం పొందుతున్నారని చెప్పారు. ఉత్తమ్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలపాలి ఆయన వ్యవహారశైలి వల్లే కాంగ్రెస్ ఖాళీ అయిందని చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఉత్తమ్ ఏం చేశారని ప్రశ్నించారు. ఉత్తమ్ రామేశ్వరరావు డబ్బులు తీసుకుంటున్నావని ఆరోపించారు. నియోజక వర్గంలో అక్రమంగా మైనింగ్ చేపడుతుంటే ఉత్తమ్ ఏం చేస్తున్నాడని అరవింద్ నిలదీశారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

రాజన్న సిరిసిల్ల, మార్చి 16: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో పొట్టి శ్రీరాములు జయంతిసందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు .పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కటకం జనార్ధన్,గౌరవ అధ్యక్షులు నగుబోతు రవీందర్ ,కటకం నాగరాజు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు భారతీయ క్రియాశీలి మరియు అమరజీవి అని అన్నారు.

మహాత్మా గాంధీ బోధించిన సత్యము అహింస అనే ఆశయాల కొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడు అని అన్నారు. పొట్టి శ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహం లో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు అని అన్నారు. తర్వాత మళ్ళీ 1941 మరియు 42 సంవత్సరంలో సత్యాగ్రహాలు మరియు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడం వల్ల మళ్ళీ మూడు సార్లు జైలు శిక్ష అనుభవించాడు అని అన్నారు.

సబర్మతి ఆశ్రమములో శ్రీ రాములు సేవ చరిత్రా త్మకమైనదని అన్నారు. ప్రతి ఒక్కరు పొట్టి శ్రీరాములు ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి లు సిద్దంశెట్టి వేణు గంప రమేష్ కోశాధికారి ఎరవెల్లి రాజశేఖర్ 'ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రసాద్ సుధాకర్ మోటూరి శ్రీనివాస్, సుధాకర్ సత్యనారాయణ అనీల్ రాజేంద'ర్,ఆర్యవైశ్య మాజీ పట్టణ అధ్యక్షుడు తాటికొండ పవన్ ,తదితరులు పాల్గొన్నారు . అ నంతరం ఆర్యవైశ్య మహాసభ 2021 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

విలీన బ్యాంక్ కస్టమర్లకు కొత్త నిబంధనలు

విలీనం అయిన బ్యాంకులో కొత్త పాస్‌బుక్కులు పొందాలి

న్యూఢిల్లీ,మార్చి16(ఆర్ఎన్ఎ): ఏప్రిల్ 1నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం సందర్భంగా విలీన బ్యాంకుల కస్టమర్లకు కొత్త నిబంధనలు అమలులోకి రానున్నాయి.కేంద్ర ప్రభుత్వం 8 ప్రభుత్వ రంగ బ్యాంకుల్ని విలీనం చేసి 3 బ్యాంకులుగా మార్చిన నేపథ్యంలో పాత బ్యాంకులకు సంబంధించిన పాస్‌బుక్కులు, చెక్‌బుక్కులు ఏప్రిల్ 1 నుండి పనిచేయవనే విషయాన్ని వినియోగదారులు గుర్తించాలి. విజయా బ్యాంక్, దేనా బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంకులకు చెందిన వినియోగదారులు.. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తమ పాస్‌బుక్‌లు, చెక్‌బుక్కులతో పాటు ఐఎఫ్ఎస్‌సీ, ఎంఐసీఆర్ కోడ్ వంటివి కూడా మారనున్నాయని అధికారులు తెలిపారు.

విలీనం చేసిన బ్యాంకుల కస్టమర్లు.. తమ మొబైల్ నంబర్, చిరునామా, నామినీ మొదలైన వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. తద్వారా ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుంది. అయితే, సిండికేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్ కస్టమర్లకు కొంత ఉపశమనం లభించింది. సిండికేట్ బ్యాంక్ ఖాతాదారుల ప్రస్తుత చెక్ బుక్స్ 2021 జూన్ 30 వరకు చెల్లుబాటు అవుతాయని బ్యాంకు ప్రకటించింది. కొత్త చెక్‌బుక్కు, పాస్‌బుక్కు పొందిన తర్వాత.. మ్యూచువల్ ఫండ్స్, ట్రేడింగ్ అకౌంట్స్, లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ, ఆదాయపు పన్ను ఖాతా, ఎఫ్డీ / ఆర్డీ, పీఎఫ్ ఖాతా, బ్యాంక్ ఖాతాలు వంటి వాటిలో కూడా వినియోగ దారులు తమ సమాచారాన్ని అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇంకా అంతేకాకుండా ఆదాయపు పన్ను విషయంలో కూడా కొన్ని మార్పులు రానున్నాయి. ఏప్రిల్ 1 తర్వాత 75 ఏండ్ల వయసు పైన ఉన్నవారు ఆదాయపు పన్ను రిటర్న్స్ ఫైల్ చేయాల్సిన అవసరం లేదు. పెన్షన్ ద్వారా, ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వడ్డీ ద్వారా ఆదాయాన్ని పొందుతున్నవారికి ఇది వర్తిస్తుంది. ఇక ఉద్యోగస్తులకు ఏప్రిల్ 1 నుంచి కొత్త వేతన కోడ్ అమలులోకి రానున్నది. ఈ కోడ్ ద్వారా బేసిక్ పే పెంచనున్నారు. దీంతో బేసిక్ పే పెరిగితే అందులో 12 శాతం పీఎఫ్ అకౌంట్‌లో జమ చేయాల్సి ఉంటుంది. పీఎఫ్ పెరిగితే ఉద్యోగస్తుల టేక్ హోమ్ సాలరీ తగ్గుతుందని గుర్తించాలి. వీటితో పాటు ఏప్రిల్ 1 నుంచి టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లు కూడా పెరుగనున్నాం

తెలంగాణ రాకతో మీరూ.. మేమూ ఆగమయ్యాం: జేసి

హైదరాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ): టీడీపీ నేత జేసీ దివాకర్ రెడ్డి మంగళవారం తెలంగాణ సీఎల్పీ కార్యాలయానికి వెళ్లారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలిశారు. ఈ సందర్భంగా వారి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. తెలంగాణ వచ్చాక మీరు, మేము ఆగమైపోయామన్నారు. తర్వాత వైఎస్ షర్మిల కొత్త పార్టీపై స్పందించిన జేసీ మాట్లాడుతూ షర్మిల ప్రస్తుతం వామప్ చేస్తోందన్నారు. ఏడాదిన్నరలో షర్మిల ఏపీలోకి ఎంటర్ అవుతుం దన్నారు. వైఎస్ విజయలక్ష్మికి షర్మిల మీదనే ప్రేమ ఎక్కువన్నారు. షర్మిలకు ఏదైనా కీలక పదవిస్తే సమస్య సమసిపోయేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. నరేంద్రమోదీకి తమ మద్దతు లేకుండా ఏపీలో ఒక్క సీటు కూడా రాదని జేసీ దివాకర్ రెడ్డి జోస్యం చెప్పారు.

మమత నైరాశ్యంలో ఉండి మాట్లాడుతున్నారు

బెంగాల్లో బిజెపిదే గెలుపు అన్న రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ,మార్చి16(ఆర్ఎన్ఎ): బెంగాల్‌లో గెలుపుపై నైరాశ్యంలో ఉన్నందు వల్లే మమతా బెనర్జీ బీజేపీపై ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తన కాలికి తగిలిన గాయంపై మమత ఒక్కరే బీజేపీపై నిందలు వేస్తున్నారని పేర్కొన్నారు. భద్రతా లోపాల వల్లే మమతకు గాయమైనట్టు దర్యాప్తు సంస్థలు, పరిశీలకులు సైతం తమ నివేదికల్లో పేర్కొన్నట్టు చెప్పారు. త్వరలోనే ఆమె కోలుకుం టారని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇకపోతే పశ్చిమబెంగాల్‌లో స్పష్టమైన మెజారిటీతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని రాజ్‌నాథ్ ధీమా వ్యక్తం చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుతూ ఎలా తీర్పునిచ్చారో అలాంటి తీర్పే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతం కానుందని చెప్పారు. ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండా ఎన్నికల్లోకి వెళ్తుండటం వల్ల బీజేపీకి నష్టం వాటిల్లే అవకాశంపై అడిగినప్పుడు, అలాంటిదేమీ లేదన్నారు. తమది ప్రజాస్వామ్య పార్టీ అని, గెలిచిన ఎమ్మెల్యేలంతా కలిసి తమ నాయకుడిని ఎన్నుకుంటారని చెప్పారు. ప్రధాని మోదీ దేశాన్ని సరిగా నడిపించలేకపోతున్నారంటూ మమతా బెనర్జీ చేసిన విమర్శలను రాజ్‌నాథ్ తిప్పికొట్టారు. ఆమె ఆరోపణల్లో పస లేదన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకూ మోదీ నాయకత్వంలోనే ప్రభుత్వం నడుస్తోందని అన్నారు. ప్రజల మద్దతు ఉండటం వల్లే రెండోసారి కూడా అంతకంటే ఎక్కువ సీట్లతో బీజేపీ గెలిచిందని, ప్రభుత్వాన్ని సక్రమంగా నడిపించలేకపోతే 2019లో సొంతంగా మెజారిటీ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. దేశంలో కాంగ్రెస్, వామపక్షాలు తమ ప్రాధాన్యతను కోల్పోయాయని రాజ్‌నాథ్ అన్నారు.

బీజేపీ పనితీరు గంగూలీ బ్యాటింగ్‌లా ఉంటది: రాజ్‌నాథ్ సింగ్

పశ్చిమ మిడ్నాపూర్, ,మార్చి16: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పనితీరు సౌరవ్ గంగూలీ బ్యాటింగ్‌లా ఉంటదని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. సౌరబ్ గంగూలీ క్రీజ్ దాటి ముందుకు వచ్చాడంటే సిక్సర్ కొట్టేవాడని తాము కూడా వెస్ట్ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సిక్సర్ కొట్టబోతున్నామని ఆయన చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం ద్వారా తాము క్రీజ్ దాటి ముందుకు వచ్చామని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో సిక్సర్ కొట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని రాజ్‌నాథ్ ధీమా వ్యక్తంచేశారు.

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజ్‌నాథ్ సింగ్ ఇవాళ పశ్చిమ మిడ్నాపూర్‌లో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఓ బహిరంగ సభలో ఓటర్లను ఉద్దేశించి ప్రసంగిం చారు. సౌరవ్ గంగూలీ బీజేపీ చేరను న్నారనే ఊహాగానాలు వెలువడుతున్న నేపథ్యంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ గంగూలీ పేరును ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

2వేల మీటర్ల పరుగులో స్వర్ణ విజేత కీర్తన

పిటి ఉషలా కీర్తన పేరు తెస్తుందని అభినందించిన ఎర్రబెల్లి

హైదరాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ): కీర్తన... పీటీ ఉషలా దేశానికి కీర్తిని తీసుకోస్తుందనే నమ్మకం ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు వ్యాఖ్యానించారు. కేరళలో జరిగిన సౌత్ ఇండియా జూనియర్ అథ్లెటిక్స్‌లో అండర్ -16 విభాగంలో 2 వేల మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం సాధించిన చెరిపెల్లి కీర్తనను మంత్రి అభినందించారు. కీర్తనది జనగామ జల్లాలోని గూడూరు. మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కీర్తన మంత్రిని కలిశారు. ఈసందర్భంగా కీర్తనను ప్రత్యేకంగా సత్కరించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ.. పాలకుర్తి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కీర్తన అసమాన ప్రతిభను కనబరుస్తూ, అండర్ -16 జూనియర్ అథ్లెటిక్స్ విభాగంలో స్వర్ణ పతకం గెలవడం సంతోషించదగ్గ విషయమన్నారు. గ్రామీణ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన కీర్తన ప్రతిభకు గురుకుల పాఠశాల పదను పెట్టిందన్నారు. ప్రభుత్వం స్థాపించిన గురుకుల పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు అత్యంత మెరుగైన ఆహారం, వసతి, చదువు, క్రీడా ప్రోత్సాహం లభిస్తుందని.. అందుకే గురుకుల పాఠశాలలో సీట్లకు బాగా డిమాండ్ పెరిగిందని వ్యాఖ్యానించారు. కీర్తనకు మరింత ప్రోత్సాహం లభిస్తే, పీటీ ఉష లా దేశానికి కీర్తిని తెచ్చి పేట్టే కీర్తన అవుతుందన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా కీర్తనను ప్రోత్సహిస్తామన్నారు. గూడూరుకు చెందిన చెరిపెల్లి కీర్తన, చెరిపెల్లి నాగమణి - కుమార స్వామిల కూతురు. మంత్రిని కలిసిన వారిలో గూడూరు సర్పంచ్ మంద కుమరయ్య, మాజీ సర్పంచ్ పుల్లయ్య, పూజరి రమాకాంత్ తదితరులు ఉన్నారు.

బాబుకు సిఐడి నోటీసులపై రావుల మండిపాటు

జగన్ రాక్షసానందం పొందుతున్నారని వ్యాఖ్య

హైదరాబాద్,మార్చి16(ఆర్ఎన్ఎ): తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సీఐడీ నోటీసులు ఇవ్వడాన్ని టీడీపీ పాలిట్ బ్యూరో నభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి ఖండించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..చంద్రబాబుకు నోటీసులు ఇవ్వడం ద్వారా ఏపీ సీఎం జగన్ రాక్షసానందం పొందుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు ఇవ్వడం ద్వారా చంద్రబాబును రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని రావుల చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు.

ఇదిలావుంటే నవ్యాంధ్ర రాజధానిలో అసైన్డ్ భూముల వ్యవహారంలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇవాళ ఉదయం సీఐడీ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. ఈ నోటీసులివ్వడాన్ని టీడీపీ నేతలు తీవ్రంగా తప్పు పడుతున్నారు. ఈ వ్యవహారంపై తాజాగా మాజీ ఎంపీ, టీడీపీ కీలక నేత జేసీ దివాకర్ రెడ్డి స్పందించారు. మంగళవారం నాడు తెలంగాణ సీఎల్పీ కార్యాలయానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ నేతలతో సుమారు అరగంటకు పైగా మాట్లాడారు. బయటికొచ్చాక మీడియాతో పలు విషయాలు మాట్లాడిన తర్వాత.. చంద్రబాబుకు సీఐడీ ఇచ్చిన నోటీసులపై జేసీ స్పందించారు. ఈ సందర్భంగా 'మా నీఎం.. మా వాడు' అంటూ జగన్‌ను సంభోదిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

' మా అధినేత చంద్రబాబుకు ఒక్క కానిస్టేబుల్ మాత్రమే వెళ్లి ఒకే ఒక్క కాగితం (నోటీసులు) ఇచ్చాడు. కానీ మా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, ఎంపీ విజయసాయి రెడ్డికి నోటీసులు ఇవ్వాలంటే లారీలు కావాలి. దొనకొండ లేదా వైజాగ్ రాజధాని చేయాలని చంద్రబాబుకు మేం ఆనాడే చెప్పాం. ఒకసారి నిర్ణయం జరిగిన తర్వాత మార్చడం సరికాదని ఆయన చెప్పారు. చంద్రబాబుకు సీఐడీ ఒక్క పేజీలో మాత్రమే నోటీసు ఇచ్చింది. అదే జగన్‌కు ఇవ్వాల్సి వస్తే లారీల్లో తీసుకెళ్లాలి' అంటూ జేసీ వ్యంగ్యంగా మాట్లాడారు. ఇదిలా ఉంటే.. నోటీసులపై ఎలా ముందుకెళ్లాలి..? విచారణకు వెళ్లాలా..? వద్దా..? అనే దానిపై చంద్రబాబు తన అత్యంత సన్నిహితులు, న్యాయనిపు ణులతో చర్చిస్తున్నారు. తన ఇంటికే న్యాయనిపుణులను పిలిపించుకున్న చంద్రబాబు సుమారు గంట నుంచి ఈ విషయంపై నిశితంగా చర్చిస్తున్నారు. అంతేకాదు.. నోటీసులపై కోర్టుకు వెళ్లే అంశాన్ని కూడా న్యాయనిపుణులు పరిశీలిస్తున్నారని సమాచారం. చంద్రబాబుతో పాటు మాజీ మంత్రి, టీడీపీ కీలక నేత నారాయణకు కూడా నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే.

ఇనార్బిట్ మాల్ విద్యను ప్రోత్సహించడానికి అమ్మాయిలకు టాబ్ పంపిణీ

హైదరాబాద్, మార్చి. 16 - ఈ ఏడాది ప్రారంభంలో, ఇనోర్బిట్ మాల్ యూటూకాన్ రన్ సహకారంతో దుర్గాం చెరువు వద్ద మారథాన్ పరుగును నిర్వహించింది. మారథాన్ అనేది సి.ఎస్.ఆర్ చొరవ, నిర్మన్ అనే ఎన్జీఓ చేత బాలల చదువు విద్య కోసం పనిచేస్తుంది. ఈ చొరవకు మద్దతుగా ఇనార్బిట్ మాల్స్ కూడా రూ. ఈ గొప్ప కార్యక్రమానికి 5 లక్షలు, ఇంకా ఛారిటీ రన్ రూ .6 లక్షలు నిధులు సేకరించారు. మాల్ బృందం ఇప్పుడు ఈ నిధులను సమీకరించి, నిరుపేద బాలికలకు ట్యాబ్‌లను ఏర్పాటు చేసింది. మహిళా, పిల్లల, వికలాంగుల మరియు సీనియర్ సిటిజన్స్ విభాగం కార్యదర్శి మరియు కమిషనర్ శ్రీమతి దివ్య దేవరాజన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు మరియు విద్యా మరియు అభ్యాస సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానించబడిన ట్యాబ్‌లను ప్రతి బలహీన బాలికలకు అందజేశారు, తద్వారా వారు ఈ వర్చువల్ యుగంలో తమ విద్యను కొనసాగించవచ్చు. ఎటువంటి అడ్డంకి లేకుండా. జనవరి 2021 లో జరిగిన ఛారిటీ మారథాన్ 1200 మందికి పైగా పాల్గొనడంతో భారీగా విజయం సాధించింది, ఇందులో 50 మంది ప్రత్యేక సామర్థ్యం గల రన్నర్లు ఉన్నారు, ఇది నిజంగా ఉత్తేజకరమైన క్షణం. ఈ కార్యక్రమంలో, ఇనోర్బిట్ మాల్ బృందం అన్ని భద్రతా చర్యలు ఉన్నాయని మరియు వాటికి కట్టుబడి ఉన్నాయని నిర్ధారించింది. శ్రీ అరవింద్ కుమార్ -ఐఐఎస్-ప్రిన్సిపల్ సెక్రటరీ - ఎంఏ అండ్ యుడితో పాటు జయేష్ రంజన్ -ఐఎఎస్ - పరిశ్రమలు, వాణిజ్యం (ఐ అండ్ సి) ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) విభాగాల ప్రధాన కార్యదర్శి మరియు ఇలార్బిట్ మాల్స్ సిఇఒ రజనీష్ మహాజన్ మారథాన్ పరుగులో ఫ్లాగ్ చేయబడింది. ''ఈ సిఎస్ఆర్ చొరవ నిర్మన్ సంస్థ సహాయంతో అసంపూర్తిగా ఉన్న బాలికలకు సమగ్ర విద్యకు ప్రాప్యతను మెరుగుపరచడం. మా ఇనోర్బిట్ దురుగు చెరువు కోసం మా స్వచ్ఛంద సంస్థలో భాగంగా, ఒక అమ్మాయి తన పూర్తి సామర్థ్యంతో జీవించడానికి అర్హురాలని మేము నమ్ముతున్నాము, అందువల్ల విద్య వారికి సులభంగా అందుబాటులో ఉండాలి. బాలికలు వారి విద్య కోసం, వారి పెరుగుదలకు మరియు అభ్యాసానికి సహాయపడటానికి చేస్తున్న ప్రయత్నాలను మేము గుర్తించాము, మేము విద్యా ఉ అభ్యాస సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానించబడిన ట్యాబ్‌లను ఇస్తున్నాము. " ఇనోర్బిట్ మాల్స్ సిఇఒ రజనీష్ మహాజన్ అన్నారు.

2021 ఆర్థికసంవత్సరానికి లెనెక్స్ విశ్వసనీయమైన ప్రారంభం

హైదరాబాద్, మార్చి 16: -ఒంబెచీఖూా కొత్త ఆర్థిక సంవత్సరం 2021ని నమ్మకంతో ప్రారంభిస్తోంది: స్పెషాలిటీ కెమికల్స్కుంపెనీదాని అనేక కస్టమర్ప రిశ్రమలు తిరిగి పుంజుకుంటాయని ఆశిస్తోంది, అందువల్ల ఇఎమిఆం పూరి సంవత్సరానికి 900 మిలియన్ల యూరోలు మరియు 1బిలియన్ల యూరోల మధ్య ఫ్రీ మినహాయింపులను ఆశిస్తుంది. కరోనా వైరస్మహమ్మారి ఆధిపత్యం వహించిన 2020 ఆర్థిక సంవత్సరంలో ఒంబెచీఖూా దృఢంగా ఉంది. స్పెషాలిటీ కెమికల్స్ లెనెక్స్ 862 మిలియన్ల యూరోల ఫ్రీ మినహాయింపులను సాధించింది, ఇది మునుపటి సంవత్సరపు1.019 బిలియన్ల యూరోల కంటే15.4శాతం తక్కువ. అందువల్లఆదాయాలు 820 మిలియన్ల యూరోల నుండి 880 మిలియన్ల యూరోల మధ్య మార్గనిర్దేశక శ్రేణి యొక్క ఎగువ చివరలో ఉన్నాయి. అనేక వ్యాపారాలు ఊహించిన దానికంటే మెరుగ్గా అభివృద్ధి చెందిన తరువాత, జనవరి 26న, గ్రూపు బలమైన నాల్గవ త్రైమాసికంలో ప్రాథమిక గణాంకాలను విడుదల చేసింది.ఇఎమిఆం మార్జిన్స్ మినహాయింపులు14.1శాతానికి చేరుకున్నాయి, ఇది ఏడాదిక్రితం 15.0 శాతంగాఉంది. "మేము 2020 మహమ్మారి సంవత్సరంలో మంచి స్థాయిని చేరుకున్నాము నాల్గవ త్రైమాసికంలో బలమైన ముగింపుని సాధించాము. మాఆదాయ మార్జిన్ గ్రూప్ యొక్క స్థిరమైన స్థానసం క్షోభానికి పరీక్షగ